గురువారం
05-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 194
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

క్యూబాపై అమెరికా ఆంక్షలకు 30ఏళ్లు

క్యూబాపై అమెరికా ఆంక్షలకు 30ఏళ్లు గడిచాయి. రెండు దేశాల మధ్య దౌత్య బంధానికి 62ఏళ్లు పూర్తి అయ్యాయి. ఎన్నో ఒడిదుడుగులతో సాగిన ఆరు దశాబ్దాలకుపైగా సాగిన దౌత్య బంధానికి ముగింపు పలికే దిశగా అమెరికా ఏకపక్షంగా వ్యవహరిస్తోంది.

2లో

అలకలు... పక్క చూపులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

- నియోజకవర్గాల్లో వైసీపీ అసమ్మతి రాగం
- పరోక్షంగా ప్రభుత్వంపై విమర్శలు
- సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనంపై వేటు
- బుజ్జగింపుల్లో అధినేత జగన్

వైసీపీలో అసమ్మతిరాగం వినిపిస్తోంది. పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కొందరు నాయకులు తిరుగుబావుటా ఎగురవేస్తున్నారు. వారిని చక్కదిద్దడంలో జగన్ తలమునకలైపోయారు. రెండు రోజుల నుంచి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బిజీబిజీగా గడుపుతున్నారు. ఇప్పటికే ప్రత్యేక నియోజకవర్గాల సమీక్షల్ని జగన్ ప్రారంభించి, వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేస్తున్నారు. మరోవైపు అసమ్మతిరాగంపైనా దృష్టిపెట్టగా, అవి క్రమేపీ పెరగడంతో వైసీపీలో కలకలం నెలకొంది. నెల్లూరుజిల్లా వెంకటగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కొంతకాలంగా పార్టీ అధిష్టానంపై అసంతృప్తిగా ఉన్నారు. బహిరంగ సభల్లో ఏకంగా పార్టీ విధానాలు, అధికారుల పనితీరును ఎత్తిచూపుతూ వ్యతిరేకంగా మాట్లాడారు. సీఎం జగన్ ఎట్టకేలకు ఆయనకు చెక్ పెట్టారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆనం నియోజకవర్గానికి వైసీపీ నేత నేదురుమల్లి రాంకుమార్‌ను నియమించారు. ఈ చర్యలతో ఆనం అనుచరుల్లో అసంతృప్తి మరింత పెరగ్గా, నేదురుమల్లి వర్గం హర్షం వ్యక్తం చేస్తోంది. వెంటగిరి నియోజకవర్గంలో ఆయన వర్గీయులు బాణసంచా పేల్చి సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల ఆనం కుమార్తె లోకేశ్‌ను కలవడంతోనే, వైసీపీ అధిష్టానం అప్రమత్తమై ఈ చర్యలకు ఉపక్రమించింది. ఏదిఏమైనా ఆనంకు చెక్‌పెట్టి, ఆయన స్థానంలో నేదురుమల్లిని సమన్వయకర్తగా నియమించడంతో వైసీపీకి అసమ్మతి మరింత పెరగనుంది. చిరకాలం నుంచి నేదురుమల్లి, ఆనం వర్గీయుల

- మిగతా 2 లో

కుప్పం... ఉద్రిక్తం

విశాలాంధ్ర-కుప్పం:

- టీడీపీ పర్యటనలను అడ్డుకోవడానికే చీకటి జీవోలు
- ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు
- సైకో పాలన పోవాలి... సైకిల్ పాలన రావాలి
- నారా చంద్రబాబు నాయుడు

స్పృహ తప్పిన మహిళ

టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటన తీవ్ర ఉద్రిక్తంగా మారింది. కర్ణాటక సరిహద్దు పెద్దూరుకు చేరుకున్న చంద్రబాబును పోలీసులు అడ్డుకున్నారు. రోడ్‌షో, సభకు అనుమతి లేదని చెప్పడంతో పోలీసులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిచ్చిన నోటీసులు తీసుకునేందుకు నిరాకరించారు. కట్టలు తెంచుకున్న ఆవేశంతో పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఎందుకు అనుమతి ఇవ్వరంటూ నిలదీశారు. పోలీసుల వైఖరికి నిరసనగా టీడీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. 'కుప్పం గడ్డ.. చంద్రబాబు అడ్డా' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. చంద్రబాబు రాకతో పెద్దూరుకు టీడీపీ శ్రేణులు భారీగా చేరుకున్నాయి. ముందస్తుగానే ఈ ప్రాంతంలో భారీగా పోలీసులను మోహరించారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బుధవారం మధ్యాహ్నం నుంచి కుప్పంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు వెళ్తున్న టీడీపీ నేతలను పోలీసులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. బాబు పర్యటనకు ఎవరూ వెళ్లకూడదని, చంద్రబాబు రోడ్‌షో, సభకు అనుమతిలేదని పోలీసులు భయపెట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. పోలీసుల తీరుపై టీడీపీ నేతలు మండిపడ్డారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

పెద్దూరు నుంచి చంద్రబాబు పాదయాత్ర

రోడ్‌షోకు పోలీసులు అనుమతివ్వకపోవడంతో పెద్దూరు నుంచి పాదయాత్రగా తన పర్యటనను కొనసాగిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. దీనికనుగుణంగా పాదయాత్రగా గ్రామాల్లో చంద్రబాబు పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచాలని, ప్రభుత్వ వైఫల్యాలు, జగన్ నియంతృత్వ ధోరణిని ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. జగన్ మళ్లీ గెలవడని.. ఎన్నికల తరువాత ఇంటికి పోతారని

- మిగతా 2 లో

ఇది అప్రజాస్వామికం

చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడంపై సీపీఐ-సీపీఎం

2లో

జీవో-1 రద్దు చేసే వరకు పోరాటం

- ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల హెచ్చరిక
- ప్రజాసంఘాలు ఉద్యమాల్లోకి వెళ్లకుండా చేసేందుకే తాజా జీవో
- సీఎం అబద్ధాలు చెబుతూ మోసం : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ :

ప్రజాసంఘాలు ఉద్యమాల వైపు వెళ్లకుండా నిరోధించటానికి, రోడ్డు కూడళ్లలో రాజకీయ పార్టీలు బహిరంగ సభలు పెట్టుకోవటంపై షరతులు విధిస్తూ వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్-1ని రద్దు చేయాలని అనేక రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. జీవో-1ని రద్దు చేయాలనే అంశంపై సీపీఐ విజయవాడ నగర సమితి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయా పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు. విజయవాడ గాంధీనగర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో బుధవారం సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ 2023లో వచ్చిన జీవో నంబర్-1 చరిత్రలో నిలిచిపోతుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాతంత్రవాదులు ఈ జీవోపై చర్చించాలని కోరారు. జీవోలో పేర్కొన్న అంశాలు అందరికీ వర్తిస్తాయని సజ్జల రామకృష్ణారెడ్డి చెబుతున్నారని, అదే నిజమైతే మంగళవారం రాజమహేంద్రవరంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మీటింగ్ అంత అట్టహాసంగా ఎందుకు జరిగిందని ప్రశ్నించారు. 33 సంవత్సరాలు కుప్పం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్న చంద్రబాబు నాయుడు ఇప్పుడు కుప్పంలో కార్యక్రమం చేపడితే ఆయన వాహనాలను సీజ్ చేశారని చెప్పారు. ప్రజల హక్కులను కాలరాయటం కోసం స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి చట్టాన్ని ఇప్పుడు బయటకు తీసుకువచ్చారని విమర్శించారు. ప్రజాసంఘాలు ఉద్యమాల వైపు వెళ్లకుండా నిరోధించటానికి ఈ జీవో తెచ్చారని చెప్పారు. ముఖ్యమంత్రి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కందుకూరులో, గుంటూరులో ప్రజలు ఎందుకు చనిపోయారో దర్యాప్తు చేసి, వారిపై చర్యలు తీసుకుంటే ఎవరు కాదంటారని అన్నారు. ప్రజలు చనిపోతున్నారని అందుకే బహిరంగ సభలకు పరిమితులు విధించినట్లు చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయాడని, అయినా ముఖ్యమంత్రులు హెలికాప్టర్‌లలో తిరుగుతున్నారని చెప్పారు. చంద్రబాబు అప్పులు చేశాడు... నేను (జగన్) ఇంకా ఎక్కువ అప్పులు చేశానని చెప్పు అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వర్గ పోరాటం జరుగుతుందంటూ జగన్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాష్ట్రంలో కుల పోరాటం జరుగుతుందన్నారు. కమ్మ కులానికి వ్యతిరేకంగా రాజకీయం చేస్తూ పబ్బం గడుపుకోవాలని జగన్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జగన్ చేసేది వర్గ పోరాటం అయితే రాష్ట్రంలో 10 కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయని వాటిలో ఏ ఒక్కటీ వైసీపీని బలపర్చలేదని అన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సభలకు జనాదరణ ఎక్కువగా ఉందని, దాంతో ప్రభుత్వ వ్యతిరేకత పెరుగుతుందనే భయంతో దొడ్డిదారిన జీవో ఒకటి తీసుకువచ్చారని అన్నారు. 70 మంది సలహాదారులను ఎవరి కోసం నియమించారని ప్రశ్నించారు. వారిలో ఎక్కువ మంది సాక్షి పత్రికలో పని చేసిన వారేనని అన్నారు. సాక్షిలో పని చేసే వారికి ప్రజల సొమ్ముతో జీతాలు చెల్లిస్తున్నారని

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అయితే ఈయనని కూడా శంకరగిరి మాన్యాలే పట్టిస్తారంటావా?

ఆ ఇళ్ల స్థలాలు మాకొద్దు!

ఊరికి దూరంగా... శ్మశాన వాటికకు దగ్గరగా

- తిరస్కరించిన 95 వేల మంది లబ్ధిదారులు
- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి విముఖత
- నిర్మాణం ప్రారంభించినవి 16.67 లక్షల ఇళ్లు
- కేంద్రం వాటా నిధులు అందని వైనం
- ఇప్పటికీ విడుదల కాని రాష్ట్ర వాటా

అమరావతి:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలకు సంబంధించిన ఇళ్ల స్థలాలపై లబ్ధిదారులు విముఖత చూపుతున్నారు. చాలీచాలని, నివాసయోగ్యం కాని ప్రాంతాలలో స్థలాలు ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇళ్ల స్థలాలు తీసుకున్న 95 వేల మందికి పైగా మహిళా లబ్ధిదారులు వివిధ కారణాలతో ప్రభుత్వ పథకం కింద ఇళ్లు నిర్మించుకోవడానికి నిరాకరిస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వం ప్రతిపాదించిన లేఅవుట్‌లు మానవ నివాసాలకు దూరంగా లేదా శ్మశాన వాటికలకు దగ్గరగా ఉన్నందున ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో స్థలాలు ఇవ్వాలని లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రత్యామ్నాయ స్థలాలు వెతకడానికి దాదాపు రూ.800 కోట్లు వెచ్చించాల్సి రావడంతో ప్రభుత్వం ఇరకాటంలో పడింది. 'లబ్ధిదారుల డిమాండ్‌ను నెరవేర్చాలంటే ప్రైవేట్ యజమానుల నుంచి 2 వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించాలి. గతంలో మేం ఇచ్చింది ప్రభుత్వ భూమి' అని గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇంటి స్థలం (ఒక్కొక్కటి 1.5 సెంట్లు) తీసుకోవడానికి, ఇల్లు నిర్మించుకోవడానికి నిరాకరిస్తున్న 95,106 'కఠినమైన కేసులు' ఉన్నాయని ఆ శాఖ అధికారులు

- మిగతా 2 లో

సాధనాత్ సాధనే సర్వం
Everything is possible with efforts
సంస్మరణ సభ
50 వసంతాల సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో మా కుటుంబాన్ని మాత్రమే కాక ఎన్నో వేలమంది విద్యార్థులను, తద్వారా వారి జీవితాలను తీర్చిదిద్దిన అక్షరశిల్పి మా అమ్మ

కీ॥ శే॥ శ్రీమతి చెరుకూరి థెరీసమ్మ గారు
M.Sc, M.Ed., M.Phil.,
ఛైర్ పర్సన్, జార్జి విద్యాసంస్థలు
జననం : 01 జూలై, 1937 | మరణం : 26 డిసెంబర్, 2022
మార్కాపురం, SGIT క్యాంపస్‌లోని జార్జి గ్రీన్స్ నందు
5 జనవరి 2023 | గురువారం ఉదయం 10 గం॥లకు | సంస్మరణ సభ జరుగును
ఇట్లు
కుటుంబసభ్యులు
జార్జి విద్యాసంస్థల సిబ్బంది మరియు పూర్వ విద్యార్థులు
మార్కాపురం, ఆత్మకూరు, కర్నూలు

కజక్ కేబినెట్ పునర్వ్యవస్థీకరణ

కొత్త డిప్యూటీ ప్రధాని నియామకం

అల్మటీ: కజకస్థాన్‌లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ జరిగింది. నూతన ఉప ప్రధానమంత్రిగా కోసిబాయేవ్ గాలిమ్‌జహాన్ టెల్‌మానోవిచ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ దేశ ప్రభుత్వ ప్రకటన తెలిపింది. కొత్త మంత్రులతో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ పత్రాలపై కజక్ అధ్యక్షుడు కస్సీమ్‌జోమార్ట్ టోకాయేవ్ బుధవారం సంతకాలు చేశారు. ఉప ప్రధానిగా కోసిబాయేవ్ గాలిమ్‌జహాన్ టెల్‌మానోవిచ్ నియామకాన్నీ ఆమోదించారు. పరిశ్రమ, మౌలికవసతుల అభివృద్ధి, విద్య, సంస్కృతి, క్రీడా, ఎకాలజీ, సహజ వనరుల శాఖలకు మంత్రుల్ని నియమిస్తూ పత్రాలపైనా అధ్యక్షుడు సంతకాలు చేశారు అని ప్రకటన పేర్కొంది.

క్యూబాపై అమెరికా ఆంక్షలకు 30ఏళ్లు

ఆర్థిక యుద్ధం ఆపండి: అగ్రరాజ్యానికి అంతర్జాతీయ సమాజం డిమాండ్

పారిస్/హవానా: క్యూబాపై అమెరికా ఆంక్షలకు 30ఏళ్లు గడిచాయి. రెండు దేశాల మధ్య దౌత్య బంధానికి 62ఏళ్లు పూర్తి అయ్యాయి. ఎన్నో ఒడిదుడుగులతో సాగిన ఆరు దశాబ్దాలకుపైగా సాగిన దౌత్య బంధానికి ముగింపు పలికే దిశగా అమెరికా ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. మరోవైపు క్యూబాపై అమెరికా వాణిజ్య-ఆర్థిక ఆంక్షలు మూడు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉండగా అంతర్జాతీయ సమాజం ఎప్పటికప్పుడు వీటిని వ్యతిరేకిస్తూ వచ్చింది. తాజాగా మరోమారు ఆర్థిక యుద్ధం అంతానికి డిమాండ్ చేసింది. కానీ అమెరికా తీరులో మార్పులేదు. 2022, నవంబరు 3న ఐక్యరాజ్య సమితి జనరల్‌లో ఇదే అంశంపై ఓటింగ్ నిర్వహించగా మెజారిటీ సభ్యులు ఆంక్షల రద్దుకు మద్దతివ్వగా అమెరికా, ఇజ్రాయిల్ మాత్రమే మద్దతిచ్చాయి. 1960 నుంచి క్యూబాపై వాషింగ్టన్ ఆంక్షలు ఉండటాన్ని వ్యతిరేకిస్తూ 185 ఓట్లు వచ్చాయి. బ్రెజిల్, ఉక్రెయిన్ దేశాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. అంతర్జాతీయ సమాజం చేసిన డిమాండ్లపై ఐక్యరాజ్య సమితిలో 1992లో తొలి తీర్మానం జరిగింది. క్యూబన్ సమాజంపై ముఖ్యంగా సున్నిత వర్గాలపై ఆంక్షలు వద్దని, ఆ దేశాభివృద్ధికి ఆటంకం కలిగించొద్దని తీర్మానం పేర్కొంది. ఫిడెల్ కాస్ట్రో విప్లవ ప్రభుత్వాన్ని గద్దెదించే ఉద్దేశంతోనే 1960లో అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ ఆంక్షలను అమలు చేశారు. అప్పట్లో యావత్ ప్రపంచం వ్యతిరేకించింది. ఇది చట్టవ్యతిరేకమని ముక్తకంఠంతో నిందించింది కానీ అమెరికా వెనక్కు తగ్గలేదు. 1992లో టోర్రిసెల్లి చట్టాన్ని తెచ్చి ఏ దేశానికి చెందిన నౌకలైనాగానీ క్యూబా నౌకాశ్రయంలోకి ప్రవేసిస్తే తమ దేశం ఆరు నెలల నిషేధం విధిస్తుందని అమెరికాలోకి హెచ్చరించింది. అదేవిధంగా 1996లో ఆంక్షలను మరింత కఠినతరం చేస్తూ హెల్మ్-బర్టన్ చట్టాన్ని తెచ్చింది. దీంతో క్యూబాలో పెట్టుబడులు పెట్టిన విదేశీ కంపెనీలకు శిక్ష విధించవచ్చు.క్యూబా సార్వభౌమాధికారాన్ని దెబ్బతీయడమే కాకుండా వాణిజ్య-పెట్టుబడులకు ఆటంకం కలిగించడమే అమెరికా అభిమతం. క్యూబా, అమెరికాకు మధ్య భౌగోళిక సంబంధమే కాకుండా చారిత్రక-సాంస్కృతికపరమైన బంధమూ ఉన్నది.

కంబోడియాలో 12,500 డెంగీ కేసులు

ఫ్నోమ్ ఫెన్: కంబోడియాలో డెంగీతో వణికిపోయింది. 2022లో 12,500 కేసులు రాగా 2021లో 1,811 కేసులు వచ్చినట్లు ఆ దేశ ఆరోగ్య శాఖాధికారి లియాంగ్ రితీయా బుధవారం వెల్లడించారు. గతేదాది 19 మంది పిల్లలు ఈ వ్యాధితో మరణించగా అంతకు ముందు ఏడాది ఎనిమిది మరణాలు సంభవించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ పారసిటోలజీ, ఎంటోమొలజీ, మలేరియా కంటోల్ డిప్యూటీ డైరెక్టర్ లియాంగ్ రితియా తెలిపారు. డెంగీ కట్టడికి ముమ్మర చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ వ్యాధి అదుపులోకి వచ్చిందన్నారు. డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో దోమల మందు పంపిణీ కొనసాగుతోందని, పగలుపూట కుట్టే దోమలతోనే ఈ వ్యాధి ప్రబలుతుందని తెలిపారు.

అమెరికాకు వెనిజులా చమురు

కారకస్: అగ్రరాజ్యం అమెరికాకు వెనిజులా చమురు ఎగుమతి చేసింది. ఈ వారాంతంలో మొత్తం 2,50,000 బ్యారళ్లను పంపింది.

పీడీవీఎస్‌ఏ చమురు కంపెనీకి, అమెరికా కన్సార్టియం చెవ్‌రోన్‌కు మధ్య ఒప్పందం ప్రకారం ఈ ఎగుమతి జరిగినట్లు పెట్రోలియోస్ డి వెనిజులా (పీడీవీఎస్‌ఏ) కంపెనీ వర్గాలు తెలిపాయి. ఆంక్షల కారణంగా నాలుగేళ్ల తర్వాత తొలి షిప్‌మెంట్ జరిగింది. పెట్రోబోస్కన్ ఆస్ఫాల్ట్ ముడిచమురు ప్రాజెక్టు తిరిగి ప్రారంభమైనట్లు ప్రకటించిన ఎనిమిది రోజుల్లోగా చమురు ఎగుమతైనట్లు అనధికార వర్గాల సమాచారం.

ఎన్నికల్ని సీరియస్‌గా తీసుకోవాలి

- ఈసారి గెలిస్తే...30 ఏళ్లు మనమే

- వైసీపీ శ్రేణులకు జగన్ ఉద్బోధ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే అసెంబ్లీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని వైసీపీ శ్రేణులకు ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. ఈసారి గెలిస్తే మరో 30 ఏళ్లు మనమే అధికారంలో ఉంటామని, ప్రజలకు మంచి పరిపాలన అందిస్తామని ఆయన పేర్కొన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ కార్యకర్తలతో సీఎం జగన్ భేటీ నిర్వహించారు. తొలుత దివంగత వైఎస్ఆర్ విగ్రహానికి జగన్, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అవినాష్ పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో కార్యకర్తల యోగక్షేమాలను జగన్ అడిగి తెలుసుకున్నారు. ఎన్ని కష్టాలున్నా మీట(బటన్) నొక్కే కార్యక్రమాన్ని చేస్తున్నాననీ, మీరు కలిసికట్టుగా ఎన్నికల్లో గట్టిగా పనిచేయాలని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి, వారి ఆశీర్వాదాలు తీసుకోవాలని, మనకు ఓటు వేయని వారి ఇళ్లకు కూడా వెళ్లాలని సూచించారు. చేసిన మంచిని వారికి వివరిస్తే...కచ్చితంగా వారిలో కూడా మార్పు వచ్చే అవకాశముంటుందని, మనం వెళ్లకపోతే తప్పు చేసినట్టు అవుతుందన్నారు. కార్యకర్తలను నేరుగా కలుసుకోవాలనే ఉద్దేశంతోనే నియోజకవర్గాల వారీగా సమావేశమవుతున్నామని చెప్పారు. మరో 14-15 నెలల్లో ఎన్నికలు జరుగబోతున్నాయని, గడపగడపకూ కార్యక్రమం ద్వారా మనం ప్రజల్లో మమేకం అవుతున్నామన్నారు. సచివాలయాల వారీగా కన్వీనర్లు, అలాగే ప్రతి 50 నుంచి 70 ఇళ్లకు గృహసారథులను పార్టీ నుంచి నియమిస్తున్నామని, పార్టీ కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేసుకుంటూ ముందుకు వెళ్దామన్నారు. మనం చేసిన మంచి వల్లే రాష్ట్రంలో ఎప్పుడూ జరగని రాజకీయ మార్పు జరుగుతోందని స్పష్టం చేశారు. కుప్పంలాంటి చోట్ల మున్సిపాల్టీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు ఇలా అన్నీ 80 శాతానికి పైగా క్లీన్ స్వీప్ చేయగలిగామన్నారు. విజయవాడ ఈస్ట్‌లో కూడా 21 వార్డుల్లో 14 చోట్ల గెలిచామని, ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉన్నచోట కూడా మనం అధికంగా వార్డులు గెలవగలిగామని, మార్పు అనేది ప్రస్ఫుటంగా కనిపిస్తోందని, దీనికి నిదర్శనమే కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలని సీఎం చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే మనంలో మనం సర్దుబాటు చేసుకుందామని, కచ్చితంగా 175 కి 175 సీట్లు గెలవాలంటూ జగన్ ఆకాంక్షించారు. రాబోయే ఎన్నికల్లో మనమంతా కలిసికట్టుగా పనిచేయాలని, ఎలాంటి విభేదాలున్నా పక్కనపెట్టాలని సీఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ-ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెల్లంపల్లి శ్రీనివాస్, విజయవాడ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్, కడియాల బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండరును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆవిష్కరించారు. బుధవారం వెలగపూడి సీఎస్ కార్యాలయానికి ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం చైర్మన్ వీఎస్ దివాకర్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గునిపే రాజేశ్, ఉద్యోగ సంఘాల నేతలు కలిసి సీఎస్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గ్రామ, వార్డు సచివాలయంలో లక్షా30వేల మందికి ఉద్యోగాలు కల్పించి, ప్రొబేషన్ డిక్లరేషన్ చేసినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ అజయ్ కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.రాజేశ్, సంయుక్త కార్యదర్శి లావణ్య, కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు శశికళ, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

13న కిషిడాతో బైడెన్ ద్వైపాక్షిక భేటీ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈనెల 13న శ్వేతసౌధంలో జపాన్ ప్రధాని కిషిడా ఫుమియోతో భేటీకానున్నారు. ఇద్దరు నేతలు ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొంటారు. ఉత్తర కొరియా, ఇండో-పసిఫిక్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చిస్తారు. ఈ ఏడాది మేలో జపాన్‌లోని హిరోషిమాలో జీ7 శిఖరాగ్ర సదస్సు జపాన్ అధ్యక్షతన జరగనున్న నేపథ్యంలో బైడెన్-కిషిడా భేటీ కానుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. జాతీయ భద్రతా వ్యూహం, జీ7కి జపాన్ అధ్యక్షత, ఐరాస భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యత్వం వంటి అంశాల్లో తమ మద్దతు జపాన్‌కు ఉంటుందని కిషిడాతో భేటీలో బైడెన్ ఉద్ఘాటించనున్నారు. ఈ మేరకు శ్వేతసౌధం ప్రెస్ కార్యదర్శి కెరీనా జీన్ పేర్రీ తెలిపారు.

దిగొచ్చిన 'మహా' సర్కార్

ముంబై: మహారాష్ట్ర ప్రభుత్వం మెట్టు దిగింది. ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించడం లేదని బుధవారం ప్రకటించింది. దీంతో 72 గంటల సమ్మెకు దిగిన మూడు కంపెనీల ఉద్యోగులు ఆందోళనను విరమిస్తున్నట్లు వెల్లడించారు. ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో చర్చలు ఫలించాయని, కంపెనీలను ప్రైవేటీకరించబోమని ఆయన హామీనిచ్చారని, అందుకే సమ్మెను విరమిస్తున్నామని సబార్డినేట్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజయ్ ఠాకూర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి కార్మిక సంఘాల మధ్య కొంత సమన్వయ లోపంతోనే ఈ సమస్య ఉత్పన్నమైందని, ఇంతకుముందే చర్చలు జరిగివుంటే సమ్మె పరిస్థితి వచ్చేదికాదని ఫడ్నవీస్ తెలిపారు. ప్రభుత్వ కంపెనీల ప్రైవేటీకరణను తమ ప్రభుత్వం కోరుకోవడంలేదని చెప్పారు. అదానీ గ్రూపు కంపెనీ ఒకటి 'ప్యారలల్ డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్' (ప్రభుత్వంతో పాటు విద్యుత్ సరఫరా చేసేలా లైసెన్స్) కోరిందని, విద్యుత్ కంపెనీల ప్రైవేటీకరణకు మద్దతివ్వబోమని స్పష్టంచేశారు. ఈ సమస్యను చర్చించి పరిష్కరించామని ఫడ్నవీస్ తెలిపారు. మహారాష్ట్ర రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు, అధికారులు, ఇంజినీర్లు, సంఘర్ష సమితీ (30 కార్మిక సంఘాలు) సమ్మెలో పాల్గొన్నారు. వివిధ డిమాండ్లతో 31 యూనియన్ల యాక్షన్ కమిటీ... మహారాష్ట్ర రాజ్య కర్మచారి, అధికారి, అభియాంత సంఘర్ష్ సమితి గతనెలలో ఆందోళనకు దిగింది. అదానీ విద్యుత్ సబ్సిడరీకి సరఫరా లైసెన్సు జారీ చేయొద్దు అని డిమాండ్ చేసింది.

శాంతియుతంగా నిరసన

మహారాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సమ్మె శాంతియుతంగా జరిగింది. వేలాది మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొని విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గళాన్ని వినిపించారు. మెస్మా (మహారాష్ట్ర అత్యవసర సేవల నిర్వహణ చట్టం) అమలు, చర్యలు తీసుకుంటామన్న ప్రభుత్వ హెచ్చరికలను ఉద్యోగులు బేఖాతరు చేశారు. రాష్ట్రవ్యాప్త సమ్మెలో వేలాది మంది పాల్గొన్నారని మహారాష్ట్ర రాష్ట్ర విద్యుత్ కార్మికుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి కృష్ణభోయిర్ అన్నారు. శాంతియుతంగా సమ్మె జరిగిందని చెప్పారు. మహారాష్ట్ర విద్యుత్ సరఫరా కో.లి (మహా విత్రన్), మహారాష్ట్ర విద్యుత్ ట్రాన్స్‌మిషన్ కో.లి. (మహా పరేషన్), మహారాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి కో.లి.(మహా నిర్మితి) ఉద్యోగులు ఆందోళనలో పాల్గొన్నట్లు వెల్లడించారు.

విద్యుత్ కోతలు-మెస్మా అమలు: సమ్మె కారణంగా పూనే రూరల్, వార్ధా, బుల్ధానా, అకోలా, శిరూర్, సంగ్లీ, నాగపూర్, అమరావతి, చంద్రాపూర్ ప్రాంతాలకు విద్యుత్ నిలిచిపోయింది. పూనేలోని సింహగాడ్ రోడ్డు, మణిక్‌బాగ్ ప్రాంతాల్లో తెల్లవారుజామున 3 గంటల నుంచి కరెంట్ లేదు. భోంసారి ఎంఐడీసీ పరిధిలోని వెయ్యి కర్మాగారాలు పనిచేయలేదు. కాత్రాజ్, వకడ్, విశ్రన్‌వాదీలోనూ సరఫరా ఆగిపోయింది. కాగా, నాగపూర్ కొరాడి ప్లాంట్ వద్ద అదనపు పోలీసు సిబ్బందిని ప్రభుత్వం మోహరించి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్న ప్రభుత్వం రాష్ట్రంలో మంగళవారం రాత్రి నుంచి మెస్మా అమలు చేసింది. విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీచేసింది.

ఇది అప్రజాస్వామికం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పర్యటనను పెద్దూరులో పోలీసులు అడ్డుకోవడాన్ని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు ఖండించారు. రోడ్‌షోలు, ప్రదర్శనలు నిషేధించే జీవోను అడ్డంపెట్టుకుని ప్రతిపక్ష నాయకుడిని తన సొంత నియోజకవర్గంలో తిరగకుండా అడ్డుకొని, గంటకుపైగా రోడ్డుపైనే నిలబెట్టడం అప్రజాస్వామికమన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన చేశారు. రాష్ట్రప్రభుత్వ నిరంకుశ చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఇద్దరు నేతలు పిలుపునిచ్చారు. ప్రజల హక్కులను హరించే ఈ నల్ల జీవోను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చంద్రబాబు పర్యటనను స్వేచ్ఛగా సాగనివ్వాలన్నారు. ప్రజలకు రక్షణ కల్పించే పేరుతో ప్రజలపైనే దాడులు, లాఠీచార్జీలు చేయడం అమానుషమన్నారు. ఒక మహిళ స్పృహ కోల్పోయారని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రభుత్వమే విఘాతం కలిగించడం గర్హనీయమన్నారు. ముఖ్యమంత్రితో సహా మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు యథేచ్ఛగా తిరుగుతుంటే ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలపై నిషేధం విధించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. సభలు-సమావేశాలు శాంతంగా, సామరస్యంగా జరిగేలా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలని రామకృష్ణ, శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

కుప్పం... ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు జోస్యం చెప్పారు. సాక్షి టీవీ, పత్రిక అమానుషమని, ఇప్పటికే చట్టం ఉండగా ప్రభుత్వం ఎందుకు చీకటి జీవో తెచ్చిందని చంద్రబాబు ప్రశ్నించారు. ఏ చట్టం ప్రకారం జీవో 1 తెచ్చారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నెల 2న జీవో తెచ్చారని.. 3 నుంచే డీజీపీ అమలు చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యం, ప్రజల గొంతు నొక్కడమేనని, దీనిని సాగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. ఒక ప్రతిపక్ష నేత ఐదు కోట్ల మందిని ఎలా కలవగలరని, డీఎస్పీ ఇంటింటికి వెళ్లగలరా? అని చంద్రబాబు ప్రశ్నించారు. జగన్ సైకోలా మారాలనుకుంటున్నారా? పోలీసులకు దమ్ముంటే సీఎం బాబాయ్‌ను ఎవరు చంపారో తేల్చండి అని చంద్రబాబు సవాల్ విసిరారు. తాను గూండా, సైకో రాజకీయం చేయనని, ప్రతిపక్షాలను గ్రామాలకు రాకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాలను, ఎన్జీవోలను, ఉద్యోగులను, ప్రజలను బెదిరిస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. తనను ఎంతబాధపెట్టినా, ఇబ్బందులు పెట్టినా పారిపోయేవాడిని కాదని, తన పర్యటనకు ఎందుకు అనుమతి ఇవ్వరో పోలీసులు చెప్పాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. తనను అప్రతిష్టపాలు చేయాలనుకుంటున్నారా? పోలీసులు ఏం చేస్తారు.. అరెస్ట్ చేస్తారా? వైసీపీకి ఒక రూల్.. మాకో రూలా అని చంద్రబాబు ప్రశ్నించారు. తన పోరాటం పోలీసులపై కాదని.. సైకో సీఎంపై అని చంద్రబాబు మండిపడ్డారు. పోలీసుల్లోనూ మంచివారు ఉన్నారని, వారు మనసు చంపుకుని పని చేస్తున్నారని, లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. బ్రిటీష్, నియంతల పాలన కంటే జగన్ దారుణంగా ప్రవర్తిస్తున్నారని, 40 ఏళ్లలో తన వాహనాన్ని, మైక్‌ను ఎవరూ అడ్డుకోలేదని, ఈ సైకో సీఎం ఎందుకు అడ్డుకోవాలనుకుంటున్నారో తెలియడం లేదన్నారు. తాను తలచుకుంటే జగన్ పాదయాత్ర చేసేవారా? అని చంద్రబాబు ప్రశ్నించారు.

లోకేశ్ ఆగ్రహం

సీఎం జగన్‌పై టీడీపీ నేత నారా లోకేశ్ మండిపడ్డారు. 'రాష్ట్రం నీ జాగీరా జగన్. ఏపీలో ఏమైనా ఎమర్జెన్సీ విధించారా?. కుప్పంలో వైసీపీ పోలీసులు అప్రటిత యుద్ధం ప్రకటించారు' అని లోకేష్ పేర్కొన్నారు. బ్రిటిష్ చట్టానికి బూజు దులిపి అర్ధరాత్రి జీవో తెచ్చారని విమర్శించారు.

అలకలు... పక్క చూపులు

(మొదటిపేజీ తరువాయి)

మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. నేదురుమల్లి రామ్‌కుమార్ రాకతో, దాదాపు ఆనంకు ఇక వచ్చే ఎన్నికల్లో టికెట్ లేనట్లు స్పష్టమవుతోంది. టీడీపీ వైపు ఆనం అడుగులు వేసే అవకాశాలున్నాయి. అసంతృప్తిగా ఉన్న ఎమ్మెల్యేలు బాలినేని శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో జగన్ ప్రత్యేక సమావేశం నిర్వహించి, వారికి సర్దిచెప్పారు. జగన్ ఏకపక్ష నిర్ణయాలే ఈ అసమ్మతికి కారణంగా తెలుస్తోంది. మూడున్నరేళ్లు అయినా ఎమ్మెల్యేలకు కనీసం అపాయింట్‌మెంట్లు ఇవ్వకపోడం, నియోజకవర్గాల్లో సమస్యలపై ఆరా తీయకపోవడం వెరసి ప్రభుత్వంపైన, పార్టీపైన చాలా మంది అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

గుంటూరుజిల్లాల్లో అసంతృప్తుల బెడద

గుంటూరుజిల్లాలోనూ వైసీపీలో అసంతృప్తులు జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. వైసీపీ ఆవిర్భావం నుంచి జగన్‌తో వెన్నంటి నడిచిన మేకతోటి సుచరితకు రెండో విడత మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించకపోవడంతో అలక వహించారు. ఆ సమయంలో సీఎంఓ నుంచి పిలుపు రావడంతో జగన్‌ను కలిసి వ్యక్తిగతంగా భేటీ అయ్యారు. గుంటూరుజిల్లా పార్టీ అధ్యక్ష పదవిని కట్టబెట్టి, సుచరితను కాస్త బుజ్జగించాలని సూచించిన అధిష్టానానికి పెద్ద ఎదురుదెబ్బే తగిలింది. ఇటీవల గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్ష పదవికి సైతం ఆమె రాజీనామా చేసి, కేవలం తన నియోజకవర్గానికే పరిమితమయ్యారు. దీంతో ఆమె అసంతృప్తి మరోసారి తేటతెల్లమైనట్లుయింది. రెండో విడత మంత్రివర్గ విస్తరణలో ఎస్సీ సామాజిక వర్గం నుంచి నలుగురిని యథాతథంగా ఉంచి, కేవలం పార్టీలో ఉన్న సుచరిత ఒక్కదాన్నే తొలగించడం ఆమె వర్గీయులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. రాబోయే ఎన్నికల సమయానికి సుచరిత వైసీపీలోనే ఉంటారా? లేక పార్టీ వీడతారా? అనే ప్రచారం జోరుగా కొనసాగుతోంది. వైసీపీలోని కొందరు ముఖ్యనేతలు, గుంటూరుజిల్లాకు చెందిన వైసీపీ నేతల వ్యవహారశైలి, ఆధిపత్య ధోరణి నచ్చనందునే ఆమె పార్టీలో క్రియాశీలకంగా ఉండటం లేదనే వాదనలున్నాయి.

ఉండవల్లి శ్రీదేవికి చెక్?

తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఉండగానే అక్కడ అదనపు సమన్వయకర్తగా ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను నియమించడంతో అక్కడ రెండు వర్గాల మధ్య విభేదాలు నెలకొన్నాయి. ఉండవల్లి శ్రీదేవి 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచారు. రాజధాని ప్రాంత రైతుల నిరసనలను సైతం ఆమె ఎదుర్కొంటూ, పార్టీకి సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో వైసీపీలోని కొందరు గుంటూరు నేతల పెత్తందారీ గిరీని ఆమె ఫోన్లో తప్పుబట్టిన ఆడియో లీక్ అవ్వడంతో ఆమెకు ప్రాధాన్యతను తగ్గించినట్లు తెలుస్తోంది. టీడీపీ నుంచి వైసీపీలో చేరి, ఆ తర్వాత ఎమ్మెల్సీ పదవిపొందిన డొక్కాకు ఆ నియోజకవర్గ సమన్వయకర్తంగా ఇవ్వడంపై శ్రీదేవి వర్గీయులు జీర్ణించుకోలేక పోతున్నారు. దీంతో అక్కడ రెండువర్గాలపై మధ్యా విభేదాలు నెలకొన్నాయి. ప్రకాశంజిల్లా కొండపిలోనూ వైసీపీలో గ్రూపుల బెడద ఉంది.

అధిష్టానానికి తలనొప్పిగా మైలవరం

ఎన్టీఆర్‌జిల్లా మైలవరంలోనూ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తాజాగా చేసిన వ్యాఖ్యలు అధిష్టానానికి తలనొప్పిగా మారాయి. గుంటూరు చంద్రబాబు తొక్కిసలాట సభకు నిర్వాహకులైన ఎన్‌ఆర్‌ఐ ఉయ్యూరు శ్రీనివాస్‌కు మద్దతుగా వసంత కృష్ణప్రసాద్ మీడియాతో మాట్లాడటంపై వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు గుంటూరు తొక్కిసలాట సభను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాలమీద రోడ్‌షో సభలు, ర్యాలీలు నిర్వహించరాదంటూ ఉత్తర్వులు జారీజేసింది. దానిపై ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా ధ్వజమెత్తుతున్నాయి. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ నిరసనలు చేపట్టాయి. ఈ సమయంలో సాక్ష్యాత్తూ అధికార పార్టీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సైతం ఉయ్యూరు శ్రీనివాస్‌కు అనుకూలంగా చేసిన వ్యాఖ్యలు పార్టీలో కాక రేపుతున్నాయి. అంతకుముందు వసంత కృష్ణప్రసాద్ తండ్రి అయిన మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు కూడా వైసీపీకి పరోక్షంగా విమర్శనాస్త్రం సంధించారు. చాలా మంది వైసీపీ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో అసమ్మతి సెగలు ఎగసిపడుతున్నాయి. గ్రూపుల బెడదతో పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు. ఇటీవల కాలంలో సీఎం జగన్ స్వయంగా సమీక్షల నిర్వహించి, అభ్యర్థులను ప్రకటిస్తున్నారు. అప్పటివరకు టికెట్లు ఆశించిన వారంతా భంగపాటుకు గురవుతున్నారు. టెక్కలిలో దువ్వాడ శ్రీనివాస్‌ను సమన్వయకర్తగా నిర్వహించడంపై అక్కడ పార్టీలో విభేదాలు నెలకొన్నాయి. సీనియర్ మంత్రులకు రోజుల కొద్దీ అపాయింట్‌మెంట్లు ఇవ్వకపోడంపైనా విమర్శలున్నాయి. మూడున్నరేళ్ల పాలనలోనే కొంతమంది వైసీపీ ఎమ్మెల్యేలు తిరుగుబాటుకు సిద్ధమవ్వడం వైసీపీ ఆధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది.

'అసమ్మతి' తీర్పుకే పత్రికల పట్టం

నోట్లరద్దుపై జస్టిస్ నాగరత్న అభిప్రాయానికి మద్దతు

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం పెద్దనోట్లు రద్దు చేయడాన్ని సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. 2016 నవంబరు 8వ తేదీ అర్ధరాత్రి నుంచి రూ.500, రూ.1000 నోట్లు చెల్లవంటూ ప్రధాని మోదీ ఆకస్మిక ప్రకటన చేశారు. అయితే ఆ నిర్ణయాన్ని కొట్టివేయలేమని, అది చట్టబద్ధమైనదేనని సుప్రీంకోర్టు పేర్కొంది. సుప్రీం ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి అసమ్మతిని వ్యక్తం చేశారు. దీంతో ఆ న్యాయమూర్తి అభిప్రాయాల ఆధారంగానే తీర్పు వెలువడిన మరుసటి రోజు పత్రికల్లో సంపాదకీయాలు వెలువడ్డాయి. జస్టిస్ ఏఎస్ నజీర్, జస్టిస్ బీవీ గవాయ్, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఏఎస్ బొప్పన్న, జస్టిస్ వి.రామసుబ్రమణియన్ ధర్మాసనం నోట్లరద్దుపై నమోదైన 58 పిటిషన్లు విచారించింది. 2016లో కేంద్రప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల గ్రామీణ పేదల వెతలు వర్ణనాతీతం కాగా 82 మంది మరణించారు. బ్యాంకుల్లో దాచుకొన్న తమ కష్టార్జితాన్ని తీసుకునేందుకు గంటలపాటు భారీ క్యూలైన్లలో నిలుచోలేక మృత్యుఒడికి చేరుకున్నారు. నోట్లరద్దు నిర్ణయం యావత్ దేశాన్ని కష్టాలపాల్జేయడాన్ని అర్జీదారులు తమ ఫిర్యాదుల్లో కోర్టుకు మొరపెట్టుకున్నారు. నోట్ల రద్దుపై ప్రభుత్వ నిర్ణయం చట్టబద్ధతను ప్రశ్నించారు. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ ఫిర్యాదులు విచారించింది. ప్రభుత్వ చర్యకు వత్తాసు పలుకుతూ దానిని కొట్టివేయలేమని పేర్కొంది. ధర్మాసనంలోని మహిళా న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న మాత్రం భిన్నాభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. 21వేల పదాల్లో తన అసమ్మతి తెలిపారు. నోట్ల రద్దుకు సంబంధించిన ఆర్బీఐ చట్టంలోని సెక్షన్ 26(2), ఈ నిర్ణయంలో ఆర్బీఐ పాత్ర గురించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వ ప్రతిపాదనను కేవలం సిఫార్సు/సూచనగా ఆర్బీఐ ఎందుకని పరిగణించలేదని జస్టిస్ నాగరత్న ప్రశ్నించారు. ఆమె ప్రశ్నలకు ఆర్బీఐ, కేంద్రం ఎలా స్పందిస్తాయన్న కోణంలోనే కాకుండా నోట్లరద్దకు చట్టం మద్దతు... వంటి శీర్షికలతో సంపాదకీయాలు వెలువడ్డాయి. ప్రస్తుతం ప్రజల చేతిలో ఉన్న నగదు 2016 కంటే రెండింతలు కాగా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి ఆర్థిక వ్యవస్థను అగాధంలోకి నెట్టివేయడం సరైన విధానం కాదని మరికొన్ని సంపాదకీయాలు హితవు పలికాయి. 2018-19లో ఆర్థిక మందగమనానికి దారితీసినది నోట్ల రద్దు, జీఎస్టీయేనని ఇంకొన్ని సంపాదకీయాలు అభిప్రాయపడ్డాయి.

జీవో-1 రద్దు చేసే వరకు పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచే ఈ జీవోను రద్దు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తూ న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి కె.పోలారి మాట్లాడుతూ సీఎం జగన్ వలసవాద చట్టాన్ని అమలు చేస్తున్నాడని, ఇది ప్రజలను నిర్బంధించే చట్టమని విమర్శించారు. దీనిని అందరూ వ్యతిరేకించాలని కోరారు. సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి తుపాకుల వెంకట రమణ మాట్లాడుతూ ప్రశ్నించే హక్కును, మాట్లాడే హక్కును హరించేలా జీవో తీసుకువచ్చారని అన్నారు. ఇది ప్రజలు జరుపుకునే కార్యక్రమాలపై ప్రభావం చూపుతుందన్నారు. జనసేన పార్టీ అధికార ప్రతినిధి ముద్దాన శంకర్ మాట్లాడుతూ ప్రజాసమస్యలను పరిష్కరించటం చేతకాక, మానవ హక్కులను అణగదొక్కే జీవోను తీసుకువచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు లింగమనేని శివరామప్రసాద్ ప్రసంగిస్తూ, జీవో నంబర్-1ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు అతిథులను ఆహ్వానించారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు వందన సమర్పణ చేశారు. ఈ సమావేంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావుతో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ముందుగా ప్రజానాట్య మండలి నాయకులు ఎస్‌కె.నజీర్ విప్లవ గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు.

ఆ ఇళ్ల స్థలాలు మాకొద్దు!

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తెలియజేశారు. కనీసం 30 శాతం కేసుల్లో కొత్త హౌసింగ్ లేఅవుట్‌లు 'శ్మశాన వాటికల వంటి ప్రాంతాలకు సమీపంలో ఉన్నాయి' అని అధికారులు తెలిపారు. మరో 30 శాతం కేసుల్లో ప్రతిపాదిత లేఅవుట్‌లు ఇప్పటికే ఉన్న నివాసాలకు దూరంగా ఉన్నాయి. దీని కారణంగా లబ్ధిదారులు వాటిని తిరస్కరిస్తున్నారు. ఇలాంటి సమస్యలు చాలా మండల, ప్రధాన పట్టణాలు, కొన్ని సెమీ అర్బన్ ప్రాంతాలలో ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో అధికారులు రెండు, మూడు గ్రామాల ప్రజలను సముదాయించి గ్రామాలకు దూరంగా ఒకే లేఅవుట్‌ను అభివృద్ధి చేయాలని చూస్తున్నారు. ఇక్కడ లబ్ధిదారులు తమ గ్రామాల్లోనే తమకు స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే 50 వేల మంది లబ్ధిదారులకు సంబంధించి మాత్రమే సమస్య తలెత్తిందని హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ సమర్థించారు. 'ఇంటి స్థలాల కోసం సర్వే నిర్వహించి ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాలని జిల్లా కలెక్టర్లను కోరాం. సర్వే అనంతరం భూసేకరణ పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తాం' అని జైన్ వివరించారు. ఇదిలా ఉండగా ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో గతంలో కేటాయించిన స్థలాలు వ్యాజ్యంలో ఉన్నందున మరో 24,068 మంది లబ్ధిదారుల కోసం ప్రభుత్వం దాదాపు 600 ఎకరాల భూమిని, రూ.251 కోట్ల అంచనా వ్యయంతో సేకరించాల్సి వచ్చింది. దీంతో ఇక్కడి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లో ప్రత్యామ్నాయ భూములను గుర్తించామని, సేకరణ ప్రక్రియ కొనసాగుతోం దని గృహ నిర్మాణ శాఖ అధికారులు తెలిపారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం 'పేదలందరికీ ఇల్లు' కార్యక్రమం కింద దాదాపు 25 లక్షల మంది మహిళా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి కొత్త లేఅవుట్లలో ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజనతో దీనిని రూపొందించింది. మొదటి దశలో 18.63 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. జూన్ 2023 నాటికి వాటిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే న్యాయపరమైన సమస్యలు, లబ్ధిదారుల విముఖత కారణంగా సుమారు రెండు లక్షల ఇళ్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. ప్రారంభించిన 16.67 లక్షల ఇళ్లలో రెండేళ్లలో కేవలం 6.96 లక్షలు మాత్రమే బేస్‌మెంట్‌కు చేరుకోగా, 2.09 లక్షల ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రాష్ట్రానికి గృహ నిర్మాణ కార్యక్రమం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.5,172 కోట్లు విడుదల చేసింది. అయితే ఉద్దేశించిన ప్రయోజనం కోసం రూ.1,140 కోట్లు ఖర్చు చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా గృహ నిర్మాణాల కోసం తన వాటాగా రూ.888 కోట్లను విడుదల చేయకపోవడం వల్ల పురోగతికి తీవ్ర ఆటంకం ఏర్పడిందని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఈ రూ.2,028 కోట్లను తక్షణమే విడుదల చేసి వినియోగించుకుంటే తప్ప, కేంద్రం రూ.2,488 కోట్ల గ్రాంట్‌ను విడుదల చేయదు. దీంతో కార్యక్రమం మొత్తం ప్రమాదంలో పడే అవకాశం ఉంది' అని అధికారులు తెలిపారు.

సుస్థిర ప్రగతిలో ముందుందాం

- ప్రజలకు మెరుగైన సేవలందించాలి
- అంకితభావంతోనే సత్ఫలితాలు
- గ్రామ, వార్డు సచివాలయాల ఖాళీల భర్తీ
- అన్ని విభాగాల్లో ముఖ ఆధారిత హాజరు
- అధికారులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సుస్థిర ప్రగతి లక్ష్యాల సాధనలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలవాలని, వాటిపై గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి అవగాహన కల్పించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాలపై క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. సచివాలయాల్లో మెరుగైన పనితీరు, సమగ్ర పర్యవేక్షణ, సుస్థిర ప్రగతి లక్ష్యాల సాధనలో సచివాలయాల కీలకపాత్ర, సచివాలయాల్లో ఏర్పడిన ఖాళీల భర్తీ తదితర అంశాలపై సీఎం సమీక్షించారు. గ్రామస్థాయిలో అమలవు తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసినప్పుడు సుస్థిర ప్రగతి లక్ష్యాలు అందుకోగలమని సీఎం చెప్పారు. లేకుంటే ఆ లక్ష్యాల సాధనలో పురోగతి కనిపించబోదన్నారు. పరిపాలనలో విప్లవాత్మక మార్పుగా గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశామని, చివరిస్థాయి వరకూ సమర్థవంతమైన డెలివరీ మెకానిజమే వీటి లక్ష్యమని సీఎం వివరించారు. ఇలాంటి వ్యవస్థ సమర్థవంతంగా పని చేయాలని, సరైన ఎస్‌ఓపీలు, పర్యవేక్షణ లేకపోతే ప్రయోజనం ఉండబోదన్నారు. సిబ్బంది హాజరు దగ్గర నుంచి అన్నిరకాలుగా పర్యవేక్షణ ఉండాలని, గ్రామ, వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకూ స్పందన నిర్వహించాలన్నారు. ప్రభుత్వ విభాగాల వారీగా మండలాల స్థాయిలో పర్యవేక్షించాలని, నివేదిక విభాగం పటిష్ఠంగా ఉండాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిపై విభాగాల వారీగా మండలస్థాయిలో పర్యవేక్షణ ఉండాలని, ఎవరెవరు ఏం చేయాలన్న దానిపై చాలా స్పష్టత ఉండాలన్నారు. అర్జీల పరిష్కారం చాలా ముఖ్యమైందని, ఆ పరిష్కారంలో నాణ్యత ఉండాలన్నారు. ఒకే అర్జీ మళ్లీ వచ్చినప్పుడు మళ్లీ అదే వ్యవస్థ దాన్ని పరిశీలించే బదులు, ఆ పై వ్యవస్థ పరిశీలించి దానిని పరిష్కరించాలని సూచించారు. అధికారులు అంకిత భావంతో విధులు నిర్వహించినప్పుడే సత్ఫలితాలు వస్తా యన్నారు. ప్రభుత్వ శాఖాధిపతులు ప్రతినెలా రెండు సచివాలయాలను తప్పనిసరిగా సందర్శించాలని, దీనివల్ల వాటి సమర్థత పెరుగుతుందని చెప్పారు. ప్రభుత్వంలో సమర్థవంతమైన ఉద్యోగులు న్నారని, సచివాలయాల స్థాయిలో మెరుగైన సేవలను ప్రజలకు అందించాలని, అప్పుడే ప్రజలకు అన్నిరకాలుగా ఉపయోగం, అనుకున్న లక్ష్యాలు సాధిస్తామని చెప్పారు. సిబ్బందితో మంచి సమ న్వయం కోసం, వారు అందుబాటులో ఉండేలా మెరుగైన విధానాలు అవలంబించాలని ఆదేశించారు. ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నాన్ని వాడుకోవాలన్నారు. అందుకే ప్రతి ప్రభుత్వ విభాగంలోనూ ముఖ ఆధారిత హాజరు అమలు చేశామని స్పష్టంచేశారు. ప్రభుత్వ శాఖాధిపతుల నుంచే ఇది అమలైతే... కిందిస్థాయిలో అందరూ అమలు చేస్తారన్నారు. దీనివల్ల సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజల వినతులకు పరిష్కారంపై దృష్టిపెడతారని, లేకపోతే అంతిమంగా ఇబ్బందులు పడేది ప్రజలేనని సీఎం వ్యాఖ్యానించారు.

సచివాలయాల్లో సాంకేతిక పరికరాల విషయంలో ఎలాంటి లోపం ఉండకూదని సీఎం జగన్ అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీలు భర్తీ చేయాలని అధికారులను ఆదే శించారు. నియామకాల్లో ఎలాంటి లోపం ఉండకూడ దన్నారు. ఈ నెలాఖరులోగా రాష్ట్ర సచివాలయం నుంచి గ్రామ సచివాలయం వరకూ ముఖఆధారిత హాజరు అమలు చేయాలని, అన్ని గ్రామ సచివాలయాలను వైర్డ్ ఇంటర్నెట్‌తో అనుసంధానించాలని ఆదేశించారు. ప్రస్తుతం వైర్‌లెస్ ఇంటర్నెట్‌తో నడుస్తున్న 2,909 గ్రామ సచివాల యాలను వైర్డ్ ఇంటర్నెట్‌తో అనుసంధించాలని అధికారులు కోరారు. ఆర్బీకేలు, గ్రామ సచివాలయాల్లోనూ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, అంగన్‌వాడీలను సచివాలయాల పర్యవేక్షణ లోకి తీసుకురావాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.సాయి ప్రసాద్, గ్రామ, వార్డు సచివాలయాల స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్, వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, హోంశాఖ ముఖ్యకార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా, మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మీ, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ జైన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ఎండీ ఇంతియాజ్, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ కమిషనర్ షన్ మోహన్, మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ ఎ.సిరి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లకు రూ.5లక్షలు ఇవ్వాల్సిందే

జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-మంగళగిరి: జగనన్న ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల, గ్రామ మున్సిపాలిటీల్లో వారం రోజులు దీక్షలు చేపడతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. జనవరి నుంచి ప్రారంభించి ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ అధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యవర్గ సమావేశం వేములపల్లి శ్రీకృష్ణభవన్‌లో బుధవారం జరిగింది. నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల అజయ్‌కుమార్ మాట్లాడారు. సీపీఐ ఆధ్వర్యంలో రెండున్నర సంవత్సరాలుగా అనేక రూపాల్లో పోరాటం చేసినా, మందకొడిగా ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారన్నారు. ఇళ్లు ఎప్పటికీ అందజేస్తారో అని ప్రజలు అయోమయ పరిస్థితిలో ఉన్నారన్నారు. జగనన్న కాలనీల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. సీపీఐ అధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళన నిర్వహిం చినప్పటికీ ప్రభుత్వం, పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర కేటాయిం చిందని విమర్శించారు. ఈ స్థలాలలో ఇల్లు నిర్మించుకోవడానికి కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే ఇస్తున్నారని, దీనివల్ల ఇంటి నిర్మాణం ఎట్టి పరిస్థితుల్లో సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ అధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని కలెక్టర్, తహశీల్థార్ కార్యాలయాల వద్ద టెంట్లు వేసి రూ.5 లక్షలు ఇచ్చే వరకు దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీలు ఎక్కడా సరైన మౌలిక వసతులు కూడా కల్పించలేదని, ప్రజలను గాలికి వదిలేసి రాష్ట్ర ప్రభుత్వం వేడుక చూస్తోందని మండిపడ్డారు. కనీసం రహదారులు కూడా వేయలేదని, రాజధానిని ఎలాగైతే గాలికొదిలేశారో అలాగే జగనన్న కాలనీలు కూడా గాలికి వదిలేశారని విమర్శించారు. సీపీఐ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, తాడేపల్లి కార్యదర్శి కంచర్ల కాశయ్య, ఏఐటీయూసీ నాయకులు చిన్ని సత్యనారాయణ, చేనేత రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి బాలకృష్ణ, మోహన్‌రావు, తాడేపల్లి సహాయ కార్యదర్శి తుడిమెళ్ళ వెంకట్రావు, మరియదాసు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి సంకెళ్లా?: అక్కినేని వనజ

విశాలాంధ్ర-రాజమండ్రి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి హిట్లర్ వారసుడుగా చీకటి జీవోలు తీసుకు వచ్చారని ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేస్తావా అంటూ సీఎంపై సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మండిపడ్డారు. ర్యాలీలు, రోడ్డుషో, బహిరంగ సభలపై ప్రభుత్వం అక్రమ జీఓ తీసుకురావడాన్ని నిరసిస్తూ సీపీఐ జిల్లా కమిటీ అధ్వర్యంలో సీపీఐ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరి తాడితోట జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రదర్శనలో చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. అనంతరం జీవో ప్రతులను దగ్ధం చేశారు. జగన్ రాజ్యాంగాన్ని అవమాన పరిచారని వనజ అన్నారు. ఎప్పుడూ లేని విధంగా జగన్ అప్రజాస్వామిక విధానాలు అవలంబిస్తున్నారని మండిపడ్డారు. ఆయన తప్ప ఇంకెవరూ పాదయాత్ర చేయకూడదని విడ్డురంగా ఉందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయకూడదా అని నిలదీశారు. అన్ని వర్గాలవారు దీనిపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు వీ కొండలరావు, ఏ సత్యనారాయణ, సప్ప రమణ, కె జ్యోతి రాజు, సీహెచ్ సునీల్, లక్ష్మణ్, పేంటు దేముడు, అప్పల నాయుడు, వెంకటరావు, నల్ల రామారావు, సేపిని రమణమ్మ, నాగేశ్వరావు ప్రసాద్, రామకన, జియ రామరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలి: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-గన్నవరం: బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య వాదులు ఏకం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ కోరారు. బుధవారం గన్నవరం సీపీఐ కార్యాలయంలో సీపీఐ గన్నవరం నియోజక వర్గ సమితి జనరల్ బాడీ సమావేశం పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ గన్నవరం ప్రాంతం కమ్యూనిస్టు పార్టీకి ఎంతో బలం ఉందని, ఈ ప్రాంతానికి పుచ్చల పల్లి సుందరయ్య మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నారన్నారు. అంత ఘన చరిత్ర కలిగిన ప్రాంతంలో ప్రజలు చేతన్యవంతులుగా ఉండాలన్నారు. జాతీయ సభలు విజయవంతం అవడం వల్ల ప్రపంచంలోని గుర్తింపు వచ్చిందన్నారు. మోదీ ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి ఒక్క వాగ్దానాని కుడా అమలు చేయలేదని విమర్శించారు. రైతు, కార్మిక చట్టాలను రద్దు చేశాడన్నారు. మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు దోచిపెడు తోందన్నారు. సాధించుకున్న నాలుగు కార్మిక చట్టాల రద్దు చేసిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం పేరిట డబ్బులు వెదజల్లి ఓపక్క అధిక ధరలు మోపి ప్రజల దగ్గర డబ్బు గుంజుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు నెరవేర్చకపోయిన జగన్, మోదీకి దాసోహ మేనని విమర్శించారు. జిల్లా సహాయ కార్యదర్శులు, అడ్డాడ ప్రసాద్, టి తాతయ్య, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కామల ఉమామహేశ్వరరావు, గన్నవరం నియోజక వర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, కార్యవర్గ సభ్యుడు పెద్దు వెంకటరత్నం, శనగలు సుబ్బారెడ్డి, బండారు లక్ష్మయ్య, ఎం సాంబయ్య, కట్టవరపు విజయరావు, సభ్యులు నందం బసవేశ్వరరావు, ఎన్ శంకరరావు, ఎన్ మోహనరావు, కె మోహన్ రావు, వై నాగరాజు, టి శివరామ కృష్ణ, వెంగళ్ల శివయ్య, పడమట నరేష్, ఎస్ విజయ్, ఈగా సురమ్మ, రాజేశ్, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

మిర్చి రైతులకు రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలి

సీపీఐ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-నందిగామ రూరల్ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో మిరప రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే గుర్తించి మిర్చి రైతులకు ఎకరాకు లక్ష రూపాయల నష్టపరిహారం అందించాలని సీపీఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్నిడి యలమందారావు నందిగామ సబ్ డివిజన్ ఆర్డీఓ రవీంద్ర బాబుకు రైతు సంఘం నాయకులు చుండూరు సుబ్బారావు, ఇతర నాయకులతో కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. రైతులు మిరప తోటలల్లో వచ్చిన నల్లి వల్ల ఆర్థికంగా నష్టపోయి ఎటువంటి దిగుబడులు పొందలేని పరిస్థితిలో ఉన్నారని యలమందారావు ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి తోటల వల్ల నష్టపోయిన రైతులను సంబంధిత శాఖ ద్వారా గుర్తించి వెంటనే ఎకరాకు లక్ష రూపాయల నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం మంచి తరుణమే అయినా, దాని ద్వారా రైతులకు చేకూరే లబ్ధి తక్కువగా ఉందన్నారు. వెంటనే సంబంధిత అధికారుల ద్వారా పరిశీలించి నష్టపోయిన మిరప రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు ప్రభుత్వం అండగా నిలవని పక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. మన్నే హనుమంతరావు, చిన్న వీరయ్య, మల్నేటి నాగభూషణం, నాగేంద్ర ప్రసాద్, మౌలాలి పాల్గొన్నారు.

జీఓ-1 రద్దు చేయాలి: దేగా ప్రభాకర్

విశాలాంధ్ర-ఏలూరు: అర్ధరాత్రి చీకటి మాటున దొంగ చాటుగా జారీ చేసిన జీవో-1 ఉత్తర్వులను రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభలు, రోడ్ షోలు, ర్యాలీలు, సమావేశాలకు అనుమతి నిరాకరిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.1 ప్రతిపక్షాల గొంతు నొక్కడానికేనని విమర్శించారు. ఈ ఉత్తర్వులు అప్రజాస్వామికమన్నారు. ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు చేయకుండా అడ్డుకునేందుకు రాచరిక పాలన అమలు చేస్తూ దుష్ట బుద్ధితో ముఖ్యమంత్రి జగన్ ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజాస్వామ్య, పౌర హక్కులను కాలరాయడానికి ఇలాంటి జీవో తీసుకురావడం దుర్మార్గం అన్నారు. ఇప్పటికే రైతులు ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు పడుతూ రోడ్లపైకి వచ్చి ఆందోళన కొనసాగిస్తున్నారని, రైతాంగ సమస్యలను పరిష్కరించకుండా రైతులపై నిర్బంధం ప్రకటించడానికి కూడా జీవో జారీ చేసిందని సీపీఐ భావిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన వక్ర బుద్ధిని మార్చుకొని జీవో నెం.1ని ఉపసంహరించాలని, లేనిపక్షంలో జీవో ఉత్తర్వులు ఉపసంహరించే వరకు పోరాటాలు ఆపే ప్రసక్తే లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మార్చిలో చలో అసెంబ్లీ

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్ వెల్లడి

విశాలాంధ్ర -భీమవరం: కార్మిక, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మార్చిలో చలో అసెంబ్లీ చేపడతామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ అన్నారు. భీమవరంలో జరుగుతున్న సీఐటీయూ రాష్ట్ర మహాసభల సందర్భంగా బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర రంగాలతో పాటు వివిధ స్కీముల్లో పనిచేస్తున్న కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల కాలంలో చిరుద్యోగులపై పని ఒత్తిడి, వేధింపులు తీవ్రతరమయ్యాయన్నారు. అంగన్‌వాడీ, ఆశా, వీఓఏ, వీఆర్ఏ, ఆరోగ్య సిబ్బందిపై ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకుల వేధింపులు ఎక్కువయ్యాయని విమర్శించారు. ఉత్పత్తిని సృష్టించే కార్మికులను పాలకులు నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. కార్మిక శాఖ నిరుపయోగంగా ఉందని, టీఏ, డీఏలు ఇవ్వడానికి మాత్రమే కార్మిక శాఖ ఉందన్నారు. కార్మికుల హక్కులు, సమస్యలు తెలియని వారు మంత్రులుగా కొనసాగుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఫార్మా కంపెనీల్లో కార్మికులకు వేధింపులు పెరిగాయని, యాజమాన్యాలు బెంగళూరు నుంచి బౌన్సర్లను తీసుకువచ్చి కార్మిక నాయకులను, కార్మికులపై దాడులు చేయిస్తున్నాయన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో 50 లక్షల మంది అసంఘటితరంగాలలో కార్మికులు పని చేస్తున్నారని, వారికి సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలపై ఆంక్షలు విధించడంపై గఫూర్ మండిపడ్డారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కోడ్‌లుగా మార్చి కార్మికుల ప్రయోజనాలను కేంద్రం పణంగా పెట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న భవన నిర్మాణ సంక్షేమబోర్డు నిధులు రూ.1200 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కడుపు కొట్టి యాజమాన్యాల జేబులు నింపుతుందని విమర్శించారు. శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జేఎస్‌వీ గోపాలన్ పాల్గొన్నారు.

ఆదుకోండి మహాప్రభో!

ఆప్కాస్ నుంచి తొలగించిన మహిళ కుటుంబ సభ్యులు ధర్నా

విశాలాంధ్ర-సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లా, సీతానగరం మండలంలోని జోగమ్మపేట సాంఘిక సంక్షేమశాఖ గురు కులంలో 2015 నుంచి పనిచేస్తున్న ఒక మహిళను అర్ధాంతరంగా తొలగించి అన్యాయం చేశారని జోగమ్మపేట గ్రామానికి చెందిన మహిళా సహాయకారి భూపతి శ్రీదేవి ఆమె కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి గురుకులం ఎదుట ధర్నా నిర్వహించారు. 2015 నుంచి ఇదే గురుకులంలో భారతి హెల్పర్‌గా పనిచేస్తున్నదని, 2019లో ఆప్కాస్‌లో కూడా చేర్చిన సొసైటీ నేడుఅ ర్ధాంతరంగా తొలగిం చడం అన్యాయమని తెలిపారు. ఆమెకంటే ఒక ఏడాది ఆలస్యంగా చేరిన మహిళను హెల్పర్‌గా కొనసాగిస్తున్న తీరుపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల అండ దండలు ఆమెకు పుష్కలంగా ఉన్నందున కొనసాగిస్తున్నారని ఆరోపించారు. స్పందనలో కూడా ఫిర్యాదు చేసినట్లు శ్రీదేవి విలేకరులకు తెలిపారు. దీంతోపాటు అప్కాస్‌లో తాను ఉండడంతో తనకు వచ్చే ఒంటరి మహిళ పింఛన్ కూడా తొలగించారని చెప్పారు. దీనిపై స్థానిక సాంఘిక, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరరావును వివరణ కోరగా జిల్లాల్లోని వివిధ సాంఘిక గురుకులాల్లో పనిచేస్తున్న దాదాపు 26మందిని రాష్ట్ర కార్యదర్శి ఆదేశాల మేరకు నిలిపి వేశామన్నారు. గతంలో 1:80విద్యార్థుల నిష్పత్తి ప్రాతిపదికన సిబ్బంది ఉండగా, నేడు 1:120 విద్యార్థుల మేరకు సిబ్బందిని తగ్గించాలని ఆదేశాలు మేరకు ముగ్గురుని నిలిపి వేశామన్నారు. సీనియారిటీతో పాటు ఎస్సీల ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆదేశాలు మేరకు అప్పట్లో ఆప్కాస్‌లో వివరాల నమోదు మేరకు భూపతి శ్రీదేవిని నిలిపివేశామని వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా అధికారుల ఆదేశాలు మేరకు తగు చర్యలు తీసుకున్నామన్నారు. శ్రీదేవికి న్యాయం చేయాలని సర్పంచ్ సింహాచలం, ఆమె పిల్లలూ, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో కాంట్రాక్టు లేదా ఆప్కాస్‌లో చేరితే భద్రత ఉంటుందని నమ్మిన ఉద్యోగులలో ఈ ఘటనతో ఆందోళన మొదలైంది.

దుర్గగుడి ఈవోపై హైకోర్టు సీరియస్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడలోని దుర్గగుడి ఈవో భ్రమరాంబకు ఏపీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశాలిచ్చింది. హైకోర్టు గత ఉత్తర్వులను బేఖాతరు చేయడంపై అగ్రహం వ్యక్తంచేసింది. ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆమె కొంత మంది తాత్కాలిక ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తింపు ఇచ్చారు. తమ జూనియర్లను క్రమబద్ధీకరించడంపై కొందరు ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. సీనియర్లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని కోర్టు ఇంతకుముందే ఆదేశాలిచ్చింది. అయితే భ్రమరాంబ కోర్టు ఆదేశాలను పట్టించుకోలేదు. దీంతో తాత్కాలిక ఉద్యోగులు మళ్లీ హైకోర్టుకు వెళ్లారు. దీంతో కోర్టు భ్రమరాంబను గురువారం తమ ఎదుట హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది.

ఓటర్ల తొలగింపుపై సీఈసీ విచారణ

విశాలాంధ్ర-ఉరవకొండ: అనంతపురం జిల్లా, విడపనకల్లు మండలం చీకలగురికి గ్రామంలో ఓటర్ల తొలగింపుపై ఫిర్యాదులు అందడంతో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్ బుధవారం ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. టీడీపీ ఓట్లు తొలగించారంటూ ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారులు కూడా గ్రామంలోని 47,48 బూతులలో ఓటర్ల తొలగింపును ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లగా స్పందన రాలేదు. దీంతో గతేడాది అక్టోబర్ 27న ఎన్నికల సంఘానికి ఎమ్మెల్యే కేశవ్ ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదుపై ఎన్నికల సంఘం స్పందించి అవినాష్ కుమార్‌ను విచారణ అధికారిగా నియమించింది. ఆయన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో సమావేశం అనంతరం ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల రికార్డులను తనిఖీ చేశారు. సంబంధిత శాఖాధికారులతో దాదాపు మూడు గంటలు విచారణ చేపట్టారు. కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీవో రవీంద్ర, తాసిల్దార్ బ్రహ్మయ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జీవో-1 వెనక్కి

ఐఎఫ్‌టీయూ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శనలు, బహిరంగ సభలు నిషేధిస్తూ రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన జీవో నం.1ని తక్షణమే ఉపసంహరించాలని ఐఎఫ్‌టీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రకటనను ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఏసు, ప్రధాన కార్యదర్శి ఆర్.మోహన్, ఉపాధ్యక్షులు ఎం.రామకృష్ణ బుధవారం విడుదల చేశారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగ, కార్మిక, విద్యార్థి, యువజన వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, వారికిచ్చిన హామీలు అమలు కోసం జరిగే ఉద్యమాలను నిరంకుశంగా అణిచివేశారన్నారు. ఆర్థిక సంక్షోభం పెరుగుతూ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి రాష్ట్రంలో ఉన్నదన్నారు. అన్ని వర్గాలలో అసంతృప్తి పెరిగి ఉద్యమాలు మరింత బలోపేతమయ్యాయని తెలిపారు. టీడీపీ నేత చంద్రబాబు నిర్వహించిన కందుకూరు, గుంటూరు ప్రదర్శనలలో జరిగిన దుర్ఘటనలను సాకుగా చూపి ప్రజా ఉద్యమాలను రాష్ట్ర ప్రభుత్వం అణచివేస్తోందని విమర్శించారు.

జీవో రద్దుకు సమిష్టిపోరు: ఓపీడీఆర్

జీవో-1ని తక్షణమే రద్దు చేయాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) ప్రధాన కార్యదర్శి వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. జీవోను రద్దు చేయకపోతే సమిష్టిగా ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విశాఖ డెయిరీ చైర్మన్ తులసీరావు కన్నుమూత



విశాలాంధ్ర-యలమంచిలి (అనకాపల్లి జిల్లా): విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. తులసీరావు 1939 ఫిబ్రవరి 1న విశాఖ జిల్లా యలమంచిలిలో వెంకటరామయ్య, సీతయ్యమ్మ దంపతులకు జన్మించారు. బాల్యం నుంచే వ్యవసాయం, పశుపోషణపై మక్కువ పెంచుకున్నారు. కృషికార్ లోక్‌పార్టీ, స్వతంత్ర పార్టీ, జనతా, టీడీపీలో కీలక పాత్ర పోషించారు. 1962లో కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. మరో రెండేళ్లకు ఎన్నికల్లో నెగ్గి యలమంచిలి గ్రామ పంచాయతీ సర్పంచ్ అయ్యారు. ఇరవయ్యేళ్లపాటు సర్పంచ్‌గా కొనసాగారు. 1985లో టీడీపీ జిల్లాశాఖ అధ్యక్షుడిగా పనిచేశారు. అప్పుడే విశాఖ డెయిరీకి ఎన్నికలొచ్చాయి. మారిన పరిస్థితుల దృష్ట్యా వెంకటరమణ స్థానంలో డెయిరీ అధ్యక్షుడిగా పాలనాపగ్గాలు చేపట్టారు. నాటినుంచి నేటి వరకూ ఆయన చైర్మన్‌గా ఉన్నారు. డెయిరీ అభివృద్ధికి ఒక కార్మికునిగా పాటుపడ్డారు. లక్షమంది వరకు పాడి రైతులకు ఉచిత ఆరోగ్యపథకాన్ని అందించారు. వారికోసం 1998లో ఆసుపత్రి కట్టించారు. ప్రతీ రైతుతో పాటు వారి కుటుంబాలకు ఉచిత వైద్యం అందించారు. విద్యతోటే ప్రతి మనిషి ఉన్నత స్థానానికి చేరగలరని తులసీరావు ప్రగాఢంగా చెప్తుంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలలేమి ఆయన దృష్టికి వస్తే వెంటనే స్పందిస్తారు. పేద, మధ్యతరగతి పిల్లలు చదువుకొనే సర్కారీ బడుల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన చేయూత నందించారు. చాలా గ్రామాల్లో ఆయన పేరుతో కళ్యాణ మండపాలు కూడా కట్టించారు. తులసీరావు మృతిపై అనేకమంది ప్రముఖులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

సంపాదకీయం

నిరంతరం ఎన్నికల ధ్యాసే

నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీకి హిందుత్వ సిద్ధాంతాన్ని అమలు పరచడం ఎంత ముఖ్యమో, నిరంతరం ఎన్నికలలో విజయాలు సాధించడం అంతకన్నా ఎక్కువ ప్రధానం. మోదీ హయాంలో ఎన్నికల నిత్యాగ్నిహోత్రం కొనసాగుతూ ఉండవలసిందే. రాహుల్ గాంధీ ప్రారంభించిన భారత్‌జోడో యాత్ర భారతీయ జనతాపార్టీకి వెన్నులో వణుకు పుట్టిస్తున్నట్టు ఉంది. నరేంద్రమోదీ నిరంతరం ఎన్నికల ప్రచారంలో నిమగ్నమై ఉంటారు. పార్లమెంటుకు, అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకే తడవ ఎన్నికలు నిర్వహించాలని మోదీ చాలాకాలం నుంచి వాదిస్తూనే ఉన్నారు. అది సాధ్యమయ్యే పనికాదని ఆయనకు తెలియకకాదు. కానీ న్యాయశాఖమంత్రి కిరణ్ రిజిజు కూడా ఉమ్మడి ఎన్నికల రాగమే ఆలపిస్తున్నారు. ఈ ఏడాది ఈశాన్య భారతంలో మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్, మిజోరంతో పాటు కర్నాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ శాసనసభలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. రాను రాను ఎన్నికల కమిషన్ ఎన్నికల ప్రచార గడువును కుదిస్తూ ఉంది. మోదీ, ఆయన నాయకత్వంలోని బీజేపీ మాత్రం నిరతరం ఎన్నికల ప్రచారంలోనే తలమునకలై ఉంటున్నారు. దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీ అని చెప్పుకునే బీజేపీ నిర్మాణమే ఎన్నికల మీద దృష్టితోనే సాగుతోంది. పోలింగ్ కేంద్రాల స్థాయికమిటీలు ఆ పార్టీకి తప్ప మరే పార్టీకీ లేవు. బీజేపీ అక్కడితో కూడా ఆగలేదు. ఓటర్ల జాబితాలోని ఒక్కో పేజీకి ఒక్కొక్క కార్యకర్తను బాధ్యుడిని చేసింది. వారిని పన్నా ప్రముఖ్ అంటున్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర త్వరలో ముగియనుంది. ఈ దశలో మోదీకి కుడి భుజం, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ నెల అంతా వివిధ రాష్ట్రాలలో పర్యటించి కార్యకర్తలను, పార్టీ యంత్రాంగాన్ని ఎన్నికలకు సన్నద్ధం చేయడంలోనే ఉంటారట. అమిత్‌షా ఈ నెలలో మొత్తం 11 రాష్ట్రాలలో పర్యటించనున్నారు. తొమ్మిది రాష్ట్రాల ఎన్నికలను ఎదుర్కోవడానికి పార్టీ యంత్రాంగాన్ని సంసిద్ధం చేయడంతోపాటు ఎన్నికలు జరగని రాష్ట్రాలలో కూడా అమిత్‌షా పర్యటించనున్నారు. అంటే 2024 సార్వత్రిక ఎన్నికలకు ఇప్పుడే ప్రచారం మొదలు పెడ్తున్నారు. గురువారం అమిత్ షా త్రిపురలో ఆరో తేదీన నాగాలాండ్, మణిపూర్ రాష్ట్రాలలో పర్యటించనున్నారు. ఏడో తేదీన ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలలో, ఎనిమిదో తేదీన ఆంధ్రప్రదేశ్‌లో ఉంటారు. అమిత్‌షా 16న ఉత్తరప్రదేశ్‌లో, 17న బెంగాల్‌లో, 28న కర్నాటకలోని హుబ్లీలో పర్యటిస్తారు. 29వ తేదీన హర్యానా పంజాబ్ రాష్ట్రాలలో ఆయన పర్యటన ఖరారైంది. మోదీ అధికారంలోకి వచ్చిన 2014 నుంచి అమిత్ షా ప్రధాన ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరిస్తున్నారు. ఏ రాష్ట్రంలో ఏయే కుల సమీకరణలు ఉండాలో ఆయనే నిర్ణయిస్తారు.

అమిత్ షా పర్యటనలో 2019లో తక్కువ మెజారిటీతో బీజేపీ గెలిచిన లేదా ఓడిపోయిన 160 నియోజకవర్గాలమీద అమిత్‌షా ప్రత్యేక దృష్టి సారిస్తారు. అక్కడి సామాజిక సమీకరణలు ఎలా ఉండాలో నిర్దేశిస్తారు. విజయం సాధించే లక్ష్యంతో వివిధ కులాల మద్దతు సమీకరించడం ఎలాగో అమిత్‌షా నిర్ణయిస్తారు. అమిత్‌షా పర్యటనకు లోక్‌సభ ప్రవాస్ అని నామకరణం చేశారు. వచ్చే ఏడాది శాసనసభ ఎన్నికలు జరగవలసి ఉన్న కర్ణాటకలో గత నెల 30న ఒక విడత అమిత్‌షా పర్యటన ఇప్పటికే ముగిసింది. 2024 లోక్‌సభ ఎన్నికలలో కనీసం 350 స్థానాలలో విజయం సాధించాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. కిందటి నెలలో బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా ఒడిశాలో ఒక విడత పర్యటన ముగించారు. ఆ రాష్ట్రంలో చాలాకాలంగా బిజూ జనతాదళ్ నాయకుడు నవీన్ పట్నాయక్ తిరుగులేని నాయకుడిగా చెలామణి అవుతున్నారు.

ఇదివరకు బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న బిజూ జనతా దళ్ ఇప్పుడు శత్రుపక్షం కాకపోయినా మిత్రపక్షం మాత్రం కాదు. అందువల్ల సొంతంగా బీజేపీ విజయం సాధించే మార్గాలను బీజేపీ అన్వేషిస్తోంది. అమిత్‌షా పర్యటనలో బీజేపీ బలహీనంగాఉన్న లోకసభ నియోజక వర్గాలలో 2024లో విజయం సాధించడం ఎలాగో మార్గాన్వేషణ చేయనున్నారు. ఆయన ఈనెలలో పర్యటన పొడవునా బహిరంగ సభల్లో ప్రసంగిస్తారు. పార్టీ కార్యకర్తలతో చర్చిస్తారు. పార్టీనిర్మాణ పరంగా తీసుకోవలసిన చర్యలపై చర్చించే సమావేశాలలో భాగస్వామి అవుతారు. బీజేపీ బలహీనంగా ఉందనుకుంటున్నా 160 నియోజకవర్గాలలో సగం సీట్లలో బీజేపీ అధ్యక్షుడు నడ్డా పర్యటిస్తే మిగతా సగం సీట్లలో వ్యవహారాలు అమిత్‌షా చక్కబెడ్తారు. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కూడా కొన్నిచోట్ల తన ప్రయత్నం తానుచేస్తారు. ఈ ప్రయత్నం అంతా పోలింగ్ కేద్రాల స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, లోపాలు ఉన్నాయనుకుంటే సరిదిద్దడం మీదే కేంద్రీకృతం అవుతుంది. బీజేపీ బలహీనంగా ఉంటుందనుకున్న లోక్‌సభ నియోజక వర్గాలలో ఏంచేయాలో ఒక పథకం రూపొందించడానికి కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, స్మృతి ఇరానీ, కిరణ్ రిజిజు, అర్జున్ రాం మేఘ్వాల్, ప్రహ్లాద్ జోషీతో ఓ కమిటీ కూడా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలస్థాయిలో బీజేపీని ఎలా మెరుగు పరచాలో సూచించడం ఈ కమిటీ బాధ్యత. ఈ కమిటీకి వినోద్ తావ్డే కన్వీనర్‌గా, సి.టి.రవి సహసమన్వయకర్తగా వ్యవహరిస్తారు. 2019లో కశ్మీర్ స్వయంప్రతిపత్తిని రద్దుచేసి ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చారు. అక్కడ ఈ తొమ్మిది రాష్ట్రాలకన్నా ముందే ఎన్నికలు నిర్వహిస్తారో లేదో ఇంకా తేలలేదు. ఎన్నికలు జరగనున్న తొమ్మిది రాష్ట్రాలలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో మాత్రమే కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఇటీవల కాంగ్రెస్ హిమాచల్‌ప్రదేశ్‌లో అధికారం సంపాదించినప్పటికీ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో అధికారం నిలబెట్టుకోవడం కాంగ్రెస్‌కు అంత సులభమేమీ కాదు. ఈశాన్య రాష్ట్రాలలో బీజేపీని నిలవరించడం కాంగ్రెస్‌కు తలకు మించినపనే.

రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్‌కు, సచిన్ పైలెట్‌కు మధ్య ఉన్న తగాదాలను కాంగ్రెస్ ఇప్పటికీ తీర్చలేకపోయింది. అయితే బీజేపీలోకూడా ముఠా తగాదాలకు లోటులేదు. మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజేకు, కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెఖావత్‌కు మధ్య సంబంధాలు ఉప్పు నిప్పు లాగే ఉండడం బీజేపీకి తలనొప్పే. అమిత్‌షా, నడ్డా విస్తృతంగా పర్యటించడం పూర్తి అయిన తరవాత ఎన్నికల కార్యక్రమం ప్రకటించడానికి ముందు, ఆ తరవాత ప్రధానమంత్రి మోదీ ఎటూ సంపూర్ణంగా ఎన్నికల ప్రచారానికే అంకితమవుతారని చెప్పనక్కర్లేదు.

అసమ్మతిని దాచుకోని న్యాయమూర్తి

"తల్లీ, తండ్రి లేకుండా ఎవరూ పుట్టరు. పుట్టడంలో పిల్లల పాత్ర లేదు. అక్రమ దంపతులు ఉండవచ్చు. అక్రమ సంతానం ఉండరు." ఇంత సూటిగా మాట్లాడగలిగిన వారే తమ అసమ్మతిని బాహాటంగా వ్యక్తం చేయగలరు. సోమవారం, మంగళవారం సుప్రీంకోర్టు నిండు కొలువులో కూర్చుని నిర్మొహమాటంగా వరసగా రెండుసార్లు అసమ్మతి వ్యక్తంచేసిన సాహసి, న్యాయమూర్తి బెంగళూరు వెంకట్రామయ్య నాగరత్న లేదా బి.వి.నాగరత్న

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సీనియారిటీ జాబితా చూస్తే ఆమె 21వ స్థానంలో ఉన్నారు. న్యాయం ఏదో నిర్భయంగా ప్రకటించడానికి సీనియారిటీ ముఖ్యంకాదని న్యాయమూర్తి నాగరత్న నిరూపించారు. గత సోమ, మంగళవారాల్లో ఆమె ఇచ్చిన రెండు అసమ్మతి తీర్పులు అమలులోకి వచ్చేవికావు. అయినా ఆ తీర్పులతో పాటు న్యాయమూర్తి నాగరత్న కూడా విస్తారంగా చర్చనీయాంశంగానే ఉన్నారు. పెద్ద నోట్ల రద్దు అంతా సవ్యంగానే ఉందని, ఆ కేసును విచారించిన

అయిదుగురు న్యాయమూర్తుల్లో నలుగురు విజ్ఞులైన న్యాయమూర్తులు భావించారు. పెద్ద నోట్ల రద్దు చేయడానికి అనుసరించవలసిన ప్రక్రియను ప్రభుత్వం ఉల్లంఘించలేదు కనక 2016 నవంబరు ఎనిమిదిన ప్రధానమంత్రి మోదీ ఉరుము ఉరుమినట్టి ప్రకటించడం ఆ నలుగురు న్యాయమూర్తుల దృష్టిలో న్యాయమైందే. చట్టబద్ధమైందే. పెద్దనోట్ల రద్దు నిర్ణయం లక్ష్యాలు నెరవేరాయా లేదా, ఆ నిర్ణయం ప్రభావం దేశవాసులమీద ఎంత తీవ్రంగా ఉంది అన్న విషయాలు తమ విచారణ పరిధిలో లేనివని ఆ నలుగురు న్యాయమూర్తులు చెప్పారు. కానీ న్యాయమూర్తి నాగరత్న దృక్కోణం మాత్రం పూర్తి భిన్నంగా ఉంది.

పెద్దనోట్ల రద్దు నిర్ణయంవల్ల జనం ఎన్ని కష్టాలు పడ్డారో ఆమె గమనించారు. అలాగే ఇంత పెద్ద నిర్ణయం కేంద్ర ప్రభుత్వం ఎలా తీసుకుంటుంది అన్న అనుమానమూ ఆమెకు వచ్చింది. విస్తృత ప్రభావం చూపించే నిర్ణయాలు పార్లమెంటులో చర్చించి తీసుకోవడమే మంచిదని ఆమె భావించారు. పార్లమెంటులో చర్చించినా అధికార పక్షానికి సంపూర్ణమైన మెజారిటీ ఉంది కనక వ్యతిరేకాభిప్రాయానికి విలువ ఉండకపోవచ్చు. కానీ రెండు వేపులా వాదనలు జనం దృష్టికి రావడమే ప్రజాస్వామ్య సారం కదా అని నాగరత్న భావించినట్టున్నారు.

పెద్ద నోట్ల రద్దు లక్ష్యం ఏమిటో ప్రభుత్వం అనేక సందర్భాలలో అనేక రకాలుగా చెప్పింది. స్థూలంగా చెలామణిలో ఉన్న కరెన్సీని తగ్గించడం, నగదురహిత ఆర్థికవ్యవస్థ అమలులోకి రావడం, దొంగనోట్లను రూపుమాపడం, తీవ్రవాదాన్ని అంతం చేయడం, నల్లడబ్బు వెలికి తీయడం లాంటి లక్ష్యాలు ఉన్నాయని ప్రభుత్వం చెప్పింది. వీటిలో ఒక్కటీ నెరవేరలేదన్న అంశం తమ విచారణ పరిధిలోకి రాదని నలుగురు న్యాయమూర్తులు అభిప్రాయపడితే నిష్ప్రయోజనకరమైన నిర్ణయం ఎందుకు అన్న అనుమానం రావడం న్యాయమూర్తి నాగరత్న అసమ్మతి తీర్పు వెలువరించడానికి కారణం అయింది. అయితే ఆమె పెద్దనోట్ల రద్దుకు వ్యతిరేకి కాదన్న వాస్తవాన్నీ మరిచి పోకూడదు.

ఆమె రెండు అంశాలపై దృష్టి నిలిపారు. ఒకటి ప్రభుత్వ నిర్ణయ ప్రయోజనం, ప్రభావం. రెండు ఈ నిర్ణయం తీసుకోవడానికి అనుసరించవలసిన విధానాన్ని అనుసరించారో లేదో తరచి చూడడం. నోట్ల రద్దుకు సిఫారసు చేయవలసింది రిజర్వుబ్యాంకు(ఆర్‌బీఐ). కానీ కేవలం 24 గంటల్లో ఈ ప్రక్రియ అంతా పూర్తి చేశారని ఆమె తేల్చారు. రిజర్వుబ్యాంకుకు ఉన్న నిర్ణయాధికారాన్ని ప్రభుత్వానికి వదిలేసి చేతులు దులుపుకున్నారని ఆ న్యాయమూర్తి నిగ్గు తేల్చారు. "ప్రభుత్వం కోరినట్టు" లాంటి మాటలు రిజర్వు బ్యాంకు చెప్పడం అనుచితమని ఆమె అభిప్రాయపడ్డారు. మిగతా నలుగురు న్యాయమూర్తులు నోట్ల రద్దు అంశంపై ఆరునెలలు సంప్రదింపులు జరిగాయని నమ్మారు. ఆ నమ్మకానికి ఆధారం ఏమిటో తెలియదు.

మంగళవారం కూడా ఆమె మరో అసమ్మతి తీర్పు వెలువరించారు. అధికారంలో ఉన్న రాజకీయ నాయకులు ఆ హోదాలో విద్వేష ప్రకటనలుచేస్తే అవి ప్రభుత్వ ప్రకటన కిందే లెక్క అంటారు ఈ న్యాయమూర్తి. ఇది మన మౌలిక విలువలకు విఘాతం కల్గిస్తుందని న్యాయమూర్తి నాగరత్న నిష్కర్షగా చెప్పారు. ఇది పౌరుల మీద దాడే అన్నారు. ప్రస్తుత వాతావరణంలో ఈ మాట చెప్పడానికి సాహసం కావాలి. అది న్యాయమూర్తి నాగరత్న దగ్గర దండిగా కనిపిస్తోంది.

అయితే ఆమె ఉన్నదున్నట్టు మాట్లాడడంవల్ల పరిణామాలు ఏమిటో చెప్పలేం. నోట్లరద్దు కేసులో ఆమె ఇచ్చిన అసమ్మతి తీర్పును జబల్‌పూర్ కేసులో అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి హన్స్‌రాజ్ ఖన్నా ఇచ్చిన తీర్పుతో పోలుస్తున్నారు. అందువల్లే ఇందిరాగాంధీ హయాంలో ఆయన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కాలేకపోయారు. సీనియారిటీ ప్రకారమే అయితే 2027లో నాగరత్న అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి కావలసి ఉంది. హెచ్.ఆర్ ఖన్నా లాంటి పరిస్థితి ఎదురుకాకపోతేనే ఆమె ప్రధాన న్యాయమూర్తి అవుతారు. అయితే ఆమె ప్రధాన న్యాయమూర్తిగా ఉండేది కేవలం 36రోజులే. ఆమె తండ్రి ఇ.ఎస్ వెంకట్రామయ్య కూడా 1989 జూన్ 19 నుంచి 1989 డిసెంబర్ 17 వరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. న్యాయమూర్తి నాగరత్న జనం తరఫున ఆలోచించే అలవాటు ఉన్న వారిలా కనిపిస్తారు. 2021లో కరోనా నేపథ్యంలో పాఠశాలలు తెరవాలని నిర్ణయించిన కర్నాటక ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి ఎగనామం పెట్టాలనుకుంది. అప్పుడు కర్నాటక హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న నాగరత్న విద్య ప్రాథమిక హక్కు అయినప్పుడు బడిపిల్లలకు మధ్యాహ్న భోజనం కూడా ప్రాథమిక హక్కే అన్నారు.

బూటకపు వార్తలు రాజ్యమేలుతున్న దశలో ఆమె సంచలనం కోసం "బ్రేకింగ్ న్యూస్", "ఫ్లాష్ న్యూస్" లాంటి వాటిని నియంత్రించే అంశం ఆలోచించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే సమయంలో భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకూడదన్ని హితవు చెప్పారు. సంచలనాలకు తావుండకూడదని అన్నారు.

–అనన్య వర్మ

నోట్లరద్దు న్యాయ సమ్మతమేనా?

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

కేంద్రం 2016లో చేసిన నోట్లరద్దు సక్రమమేనని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 02.01.2023 న తీర్పిచ్చింది. అయితే ఐదుగురి ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి బి.వి.నాగరత్న నోట్లరద్దు చట్టవిరుద్ధమని, కేంద్రం పరిధిలోనిదికాదని అసమ్మతి తీర్పిచ్చారు. కేంద్ర ప్రభుత్వం నోట్లరద్దుపై ఆర్‌బీఐతో ఆరునెలల నుండి సంప్రదింపుల్లో ఉందని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. బహుశా కేంద్రం ఇచ్చిన ధృవీకరణపత్రం ఆధారంగా ఈ నిర్ణయానికి వచ్చి ఉండవచ్చు. కాని 2016 సెప్టెంబర్‌దాకా ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేసిన రఘురాంరాజన్, నోట్లరద్దు గురించి ప్రభుత్వం తన పదవీకాలంలో ఆర్‌బీఐని సంప్రదించలేదని తన పుస్తకంలో రాశారు.

చైనా అభివృద్ధిని నిలువరించడానికి అమెరికా, భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ఈ వ్యూహంలో భాగంగా అమెరికా అభివృద్ధి సంస్థ (యుఎస్ఏఐడి), మన ఆర్థిక మంత్రిత్వశాఖతో అనేక సహకార, ఆర్థిక ఒప్పందాలను చేసుకుంది. భారత్‌లో డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహం, నగదు తగ్గింపు వాటిలో ఒకటి. భారత నగదు రహిత ఆర్థికవ్యవస్థ అమలులోవాడే డిజిటల్ కార్డులు, కార్యక్రమాలు, యంత్రాలద్వారా వాటి తయారీదారులైన అమెరికా బహుళజాతి సంస్థలు విపరీతంగా లాభపడతాయి. భారత్‌లో నగదురహిత చెల్లింపులకు 'కాటలిస్ట్' అనే పథకాన్ని ప్రవేశపెట్టినట్లు 14.10.2016 న విలేకరుల సమావేశంలోయుఎస్ఏఐడి ప్రకటించింది. దాని కొనసాగింపుగా 08.11.2016 న ప్రధాని నోట్లరద్దును ప్రకటించారు. తర్వాత దాన్ని నగదు రహితంగా మార్చారు. నోట్లరద్దు తొందరపాటన్న వారిని మోదీయులు దేశద్రోహులుగా, పాకిస్తానీయులుగా ముద్రిస్తున్నారని అమర్త్యసేన్ ఆవేదన చెందారు.

"ఆర్థికవ్యవస్థను, సమాజాన్ని శుద్ధిచేసే కఠిన నిర్ణయమే నోట్లరద్దు. నీతి, రణనీతి వేరువేరు. ఎత్తుకుపైఎత్తు వేయగలను. నా రాజకీయ లబ్ధి, ప్రజల ఇబ్బందులు ఒకేసారి ఎలా సాధ్యం? అవినీతిని రాజకీయాలతో ముడివేయడం తప్పు." అని 29.12.2016న 'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో మోదీ తాత్వీకరించారు. ఇస్లాం, క్రైస్తవ సమాజాలను శుద్ధి చేసి హిందువులుగా మార్చాలని హిందుత్వవాది దీన్‌దయాళ్ ఉపాధ్యాయ బోధించేవారు. అదే మాట మోదీ చెప్పారు. ప్రజాప్రయోజనాలలో రణనీతి ఎందుకు? ఎత్తులకుపై ఎత్తులేమిటి? రాజకీయుల స్వలాభంలో జన నష్టాలుండవా? నోట్లరద్దు రాద్ధాంతంలో అవి ఏకకాలంలో జరిగాయని ప్రపంచ ప్రఖ్యాత ప్రజాపక్ష ఆర్థికవేత్తలంతా ఆక్రోశించారు. అవినీతిలో రాజకీయ అవినీతి ఘనమైనదని ఆర్థిక నిపుణులు నివేదించారు.

కేంద్రప్రభుత్వం నుండి ద్రవ్య నిర్వహణను స్వాధీన పర్చుకోవడానికి, బ్యాంకింగ్ వ్యాపారాన్ని కొనసాగించడానికి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం, 1934 అధికరణ 3(1)ప్రకారం 'రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా' ఏర్పాటు చేశారు. అధికరణ 24(1) ప్రకారం ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు సిఫారసుతో 10,000 రూపాయలలోపు విలువగల నోట్లను కేంద్రప్రభుత్వం ముద్రించవచ్చు. రూపాయినోటు ముద్రణ చట్ట సవరణతోనే జరిగింది. ఈ అధికరణలో అనుమతించిన నోట్లలో 2000 నోటులేదు. సెంట్రల్‌బోర్డు సలహామేరకు కొన్ని డినామినేషన్ నోట్లను జారీచేయవద్దని కాని, కొనసాగించవద్దని కాని(రద్దుచేయమని కాదు) కేంద్రప్రభుత్వం నిర్దేశించవచ్చని అధికరణ 24(2) చెపుతుంది. 500, 1000 నోట్లరద్దుకుగాని, 2000 నోటు ముద్రణకుగాని సెంట్రల్ బోర్డు సిఫారసు చేసినట్లు, లేదా అనుమతించినట్లు ఆర్థికమంత్రిత్వ శాఖ తన 08.11.2016 నాటి ఎస్.ఒ3408(ఇ) ప్రకటనలో ప్రస్తావించలేదు. అసలు ఈ సందర్భంలో సెంట్రల్ బోర్డు సమావేశమే జరగలేదని రిజర్వుబ్యాంకు కార్యాచరణ తెలుపుతోంది. సెంట్రల్‌బోర్డు సలహామేరకు నిర్దిష్ట డినామినేషన్ నోట్లను ముద్రించవద్దని కాని, ఆపమనికాని కేంద్రప్రభుత్వం నిర్దేశించవచ్చని అధికరణ24(1) చెపుతోంది. ఏ డినామినేషన్ నోట్లలోనైనా, ఏ సిరీస్ అయినా, సెంట్రల్‌బోర్డు సిఫారసు మేరకు కేంద్రప్రభుత్వం చట్టబద్ధ అమలును నిలుపు చేయవచ్చని అధికరణ 26(2) వివరిస్తుంది.

ప్రతి డినామినేషన్లో 5% DR, 9BQ, 6VS, 9PH వగైరా అనేక సిరీస్ నోట్లను జారీ చేస్తారు. రిజర్వు బ్యాంకు సెంట్రల్ బోర్డుకు ఒకటిలేదా కొన్ని సిరీస్ నోట్లను మాత్రమే రద్దు పరచమని సలహాచెప్పే హక్కుంది. ఈ విషయంలో రిజర్వుబ్యాంకు సెంట్రల్‌బోర్డు, కేంద్ర ప్రభుత్వ అధికారాలు పరిమితమే. మొత్తం డినామినేషన్ నోట్లను రద్దు చేయాలంటే పార్లమెంటు చట్టంద్వారా రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం, 1934లోని 26 వ అధికరణానికి సవరణ చేయాలి. 1946లో ఆ అధికరణాన్ని సవరించి ప్రభుత్వం 26(ఎ)ను చేర్చింది. 13.01.1946కు ముందు జారీచేసిన 500, 1000, 10000 డినామినేషన్ల నోట్లను రద్దు పరిచింది. 1978లో కొన్ని డినామినేషన్ నోట్లను మొత్తంగా రద్దు చేయవలసి వచ్చినప్పుడు, అప్పటి ప్రధాని మొరార్జిదేశాయ్, అధికరణ 26ను సవరించడానికి బదులుగా 'హై డినామినేషన్ నోట్ల(డిమానిటైజేషన్) యాక్ట్, 1978' చట్టాన్ని చేశారు. ఇప్పటి 500, 1000 నోట్ల రద్దుకు కూడా పార్లమెంటు ఆమోదం, ఆర్‌బీఐ చట్టం అధికరణ 26 సవరణ అవసరం. కానీ ఇవి జరగలేదు. సెంట్రల్‌బోర్డు ఇవ్వవలసిన చట్టబద్ధ సలహాను ఇచ్చిన దాఖలాలులేవు. ప్రస్తుత ప్రహసనంలో అనేక విధాన లోపాలతోపాటు చట్ట ఉల్లంఘన జరిగింది. భారత రాజ్యాంగ అధికరణ 343(1) ప్రకారం, అధికారిక కార్యక్రమాలలో భారతీయ అంకెల అంతర్జాతీయ రూపాలను వినియోగించాలి. 2000నోటు మీద దేవనాగరి అంకెలను, హిందీస్థానంలో మరాఠీని వాడి రాజ్యాంగాన్ని ధిక్కరించారు.

ఆర్‌బీఐ సలహాను కేంద్రం పాటించాలి. నోట్లరద్దులో కార్యనిర్వాహక ఆదేశం ద్వారా కేంద్రం ఏకపక్ష నిర్ణయం తీసుకుంది. రూ.500, 1000ల నోట్లను రద్దుచేసిన ప్రభుత్వం ఈ చట్ట వ్యతిరేక పద్ధతి, విధానంపై న్యాయపరిశీలన జరపకుండా న్యాయస్థానం ఉండలేదని న్యాయమూర్తి నాగరత్న వ్యాఖ్యానించారు.

వ్యాస రచయిత ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

చరవాణి-9490204545

ఉచితరేషన్ వెనుక అసలు నిజం

డా. సోమ మర్ల

ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన(పీఎంజీకేఏవై) పథకాన్ని 2023 జనవరి ఒకటవ తేదీ నుంచి ఉపసంహరించి, ఉచితంగా రేషన్ ఇస్తామని కేంద్ర ప్రభుత్వం 2022 డిసెంబరు 23వ తేదీన ప్రకటించింది. ఇది 'చరిత్రాత్మకమైన' నిర్ణయమని ప్రశంసిచారు. అయితే ఇందులో ఎంతమాత్రం నిజంలేదు. ఇంతవరకు అందజేస్తున్న రేషన్‌కు ఇది ఎంతమాత్రం సమానమైందికాదు. జాతీయ ఆహార భద్రతా చట్టం(ఎన్ఎఫ్ఎస్ఏ) కింద దాదాపు 81.3 కోట్ల మంది పేదలకు రేషన్ పంపిణీ చేస్తున్నారు. అయితే ఈ జనవరి నుంచి ఈ రేషన్‌కు స్వస్తి చెప్పారు. ప్రస్తుతం ఒక్కొక్కరికి ఇంతవరకు అమలులో పీఎంజీకేఏవై, ఎన్ఎఫ్ఎస్ఏ కింద పదికిలోల రేషన్ ఇస్తున్నారు.

రోజువారీ పనులు చేసుకుని జీవించే అనేక మిలియన్ల మందికి నెలకు పదికిలోల బియ్యం పంపిణీ జీవనాధారం. ఇలా ప్రయోజనంపొందే పేదలలో అసంఘటిత రంగ కార్మికులు కోవిడ్-19 మహమ్మారి సందర్భంగా ఆకస్మికంగా లాక్‌డౌన్ విధించడంతో జీవనభృతిని కోల్పోయిన కోట్లాదిమంది నిర్మాణ కార్మికులు (వీరు ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు) ఉన్నారు. ప్రస్తుతం టోకు, చిల్లర వస్తువుల ద్రవ్యోల్బణం(దాదాపు 13శాతం) పెరిగిన కారణంగా ఆహారపదార్థాల, వస్తువుల ధరలు పెరిగిపోయాయి. ఉత్పత్తిరంగం దెబ్బతింది. ఉద్యోగాలు లేవు. ఫలితంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆహార వస్తువులతోపాటు కూరగాయలు, పాలు, వంటనూనెలు, వంటగ్యాస్, తదితర అనేక వస్తువుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఉదాహరణకు గత ఏడాది ఆగస్టు-అక్టోబరు మధ్యకాలంలో గోధుమపిండి ధర 18శాతం (బియ్యం ధర కూడా దాదాపు ఇంతే పెరిగింది) (ఈ వివరాలు చిత్రం 1లో) ప్రభుత్వం చేసిన ప్రకటన పంచదార పూత పూసిన చేదు మాత్ర. 2023 జనవరి నుండి ఏడాది చివరిదాకా ఎన్ఎఫ్ఎస్ఏ పథకం కింద ఉచితంగా అందచేస్తారు.

రోజువారీ పనులు చేసుకుని జీవించే అనేక మిలియన్ల మందికి నెలకు పదికిలోల బియ్యం పంపిణీ జీవనాధారం. ఇలా ప్రయోజనంపొందే పేదలలో అసంఘటిత రంగ కార్మికులు కోవిడ్-19 మహమ్మారి సందర్భంగా ఆకస్మికంగా లాక్‌డౌన్ విధించడంతో జీవనభృతిని కోల్పోయిన కోట్లాదిమంది నిర్మాణ కార్మికులు (వీరు ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు) ఉన్నారు. ప్రస్తుతం టోకు, చిల్లర వస్తువుల ద్రవ్యోల్బణం(దాదాపు 13శాతం) పెరిగిన కారణంగా ఆహారపదార్థాల, వస్తువుల ధరలు పెరిగిపోయాయి. ఉత్పత్తిరంగం దెబ్బతింది. ఉద్యోగాలు లేవు. ఫలితంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆహార వస్తువులతోపాటు కూరగాయలు, పాలు, వంటనూనెలు, వంటగ్యాస్, తదితర అనేక వస్తువుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి.

క్రమంగా రేషన్‌పై సబ్సిడీ ఎత్తివేత

ప్రజాపంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా పేదలకు అందచేస్తున్న ఆహారసబ్సిడీకి స్వస్తి పలకాలని కేంద్రప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్న అనేకమంది ఆర్థికవేత్తలు గొడవ చేస్తున్నారు. నీతిఆయోగ్ సభ్యుడు డాక్టర్ రమేష్ చంద వ్యవసాయ, ఆర్థికవేత్తలలో గౌరవనీయుడు. ఆయన 2022 డిసెంబరు తర్వాత ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకాన్ని పొడిగించటం ఏమాత్రం న్యాయంకాదని అన్నారు. అలాగే 2021లో ఐఎమ్ఎఫ్ కార్యాచరణ పత్రాన్ని రూపొందించిన డాక్టర్ సూర్జిత్ భల్లా భారతదేశంలో తీవ్ర పేదరికంలోఉన్న ప్రజలు ఒక్కశాతంలోపే(రోజుకు 1.9శాతం డాలర్లతో సమానమైన కొనుగోలుశక్తి లోపు ఆదాయంతోనే జీవిస్తున్నారు) ఉన్నారని పేర్కొన్నారు. ఈ గొప్ప విజ్ఞానవంతులైన ఆర్థికవేత్తలకు దేశంలో నెలకొన్న ఆకలితో నకనకలాడే ప్రజలు బహుశ కనిపించడంలేదు. అదే సమయంలో కార్పొరేట్లకు కోట్లాది రూపాయలు కట్టబెట్టడం, ఇతర పన్నులు తగ్గించడం, అలాగే బ్యాంకులకు చెల్లించవలసిన కోట్లాది రూపాయల బకాయిలు రద్దు చేయడాన్ని ఏనాడూ ప్రశ్నించి ఎరుగరు. 2022లో ఉత్తరప్రదేశ్‌లో తీవ్రమైన అసంతృప్తి ప్రజలలో నెలకొని ఉన్నప్పటికీ, పీఎంజీకేఏవై పథకం ద్వారా ఉచిత రేషన్ అందించడం ద్వారానే బీజేపీ గెలుపొందిందని విస్తృతవర్గాలు విశ్వసిస్తున్నాయి. ఇప్పుడు రేషన్‌కోత విధించడం ద్వారా అత్యంత భారీగా డబ్బును ప్రభుత్వం మిగుల్చుకోగలుగుతుంది. ఎన్ఎఫ్ఎస్ఏ, పీఎంజీకేఏవై పథకాల ద్వారా అందిస్తున్న ఉచిత రేషన్‌లో ప్రభుత్వం సగం కోత విధించింది. ఈ విధంగా రేషన్‌ను తగ్గించి ప్రభుత్వం భారీగా ఆదాయం పొందుతుంది. అంతేకాదు, ఆహారధాన్యాల నిల్వల్లో ఎక్కువ తగ్గింపు ఉండదు. భారీగా ధాన్యం మిగులుతుంది. డబ్బు ఆదా అవుతుంది. మరోవైపు కనీస మద్దతుధరను చెల్లించి ధాన్యాన్ని ఎఫ్‌సీఐ కొనుగోలు చేయకుండా ప్రభుత్వం నిరుత్సాహపరుస్తున్నది. అదే సమయంలో ఆహార సబ్సిడీకి బడ్జెట్‌లో కేటాయింపులను తగ్గించి పొదుపుచేస్తున్నది. పీఎంజీకేఏవై పథకాన్ని నిలిపి వేస్తున్నారు. అలాగే ఎన్ఎఫ్ఎస్ఏ పథకం ద్వారా అందిస్తున్న రేషన్‌ను తగ్గించినప్పటికీ, ఈ పథకం కింద ప్రభుత్వానికి ఏడాదికి 1.5లక్షల కోట్ల రూపాయలు మిగులుతోంది.

రోడ్డెక్కిన 4వేల మంది బాధితులు

- ఉత్తరాఖండ్‌లో కూల్చివేతల వివాదం
- నేడు సుప్రీంకోర్టులో విచారణ
- స్థానికుల నిరసనలు... ప్రార్థనలు
- రైల్వే భూమి ఖాళీ చేయాలంటున్న అధికారులు

హల్ద్వానీ/న్యూదిల్లీ: ఉత్తరాఖండ్‌లో 4 వేల మంది బాధితులు రోడ్డెక్కారు. తమ ఇళ్లు, దుకాణాలు, పాఠశాలలు, దేవాలయాలు, మసీదులు కూల్చవద్దని డిమాండ్ చేస్తున్నారు. ఎంతోకాలంగా ఇక్కడే నివాసం ఉంటున్న తమను ఖాళీ చేయించడం దారుణమని మండిపడుతున్నారు. కాగా, హల్ద్వానీలో 29 ఎకరాల రైల్వే భూమిని ఖాళీ చేయాలన్న ఉత్తరాఖండ్ హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు గురువారం విచారణ చేయనుంది. కూల్చివేతలను ఆపాలని 4 వేల మంది నిరసనలు చేస్తున్నారు. కూల్చివేతకు ముందుకు వెళ్లవద్దని అధికారులను వేడుకుంటున్నారు. ఇళ్లతో పాటు దాదాపు సగం కుటుంబాలు భూమిని లీజుకు తీసుకున్నాయి. ఈ ప్రాంతంలో దశాబ్దాలుగా నాలుగు ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రైవేట్ పాఠశాలలు, ఒక బ్యాంకు, రెండు ఓవర్‌హెడ్ తాగునీటి ట్యాంకులు, 10 మసీదులు, నాలుగు దేవాలయాలు, దుకాణాలు ఉన్నాయి. సుదీర్ఘ వ్యాజ్యం తర్వాత డిసెంబరు 20 నాటి కోర్టు ఆదేశాలను అనుసరించి జిల్లా యంత్రాంగం జనవరి 9లోగా ప్రజలు తమ ఇళ్లను ఖాళీ చేయాలని వార్తాపత్రికల్లో నోటీసు జారీ చేసింది. ఇది హల్ద్వానీ రైల్వే స్టేషన్ సమీపంలోని గఫూర్ బస్తీ, ధోలక్ బస్తీ, ఇందిరా నగర్, బంబుల్‌పురాకు చెందిన 2 కిలోమీటర్ల ప్రాంతం. తొలగింపును ఆపాలని నివాసితులు కొవ్వొత్తుల ప్రదర్శన, ధర్నాలు, ప్రార్థనలు కొనసాగించగా అధికారులు భూమిపై తనిఖీలు నిర్వహించారు. స్థానిక మసీదులో వందలాది మంది కలిసి సామూహిక ప్రార్థన చేశారు. మసీదు ఉమర్ ఇమామ్, మౌలానా ముకీమ్ ఖాస్మీ, ప్రజలు సమష్టిగా పరిష్కారం కోసం ప్రార్థించారని ఏఎన్ఐకి తెలిపారు. ఆందోళనకారుల్లో కొందరు కన్నీటి పర్యంతమయ్యారు. ఉత్తరాఖండ్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఏడీఆర్ఎం) ఇతర పరిపాలన అధికారులతో కలిసి హల్ద్వానీలో రైల్వే ఆక్రమణ ప్రాంతాన్ని పరిశీలించారు. రైల్వే ఆక్రమణలను తొలగించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఇది జరిగింది. సామాజిక కార్యకర్త, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీం కోర్టులో అధికారికంగా ప్రస్తావించిన తర్వాత, ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు ఎస్‌ఏ నజీర్, పీఎస్.నరసింహతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరుపుతామని తెలిపింది. ఎక్కువ మంది ముస్లింలు నివసించే ప్రాంతంపై చర్య తీసుకున్నందుకు బీజేపీ ప్రభుత్వాన్ని నిందిస్తూ కార్యకర్తలు, రాజకీయ నాయకులు కూడా నిరసనలలో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి హరీశ్ రావత్ రాజధాని డెహ్రాడూన్‌లోని తన ఇంటిలో గంటపాటు మౌనవ్రతం(మౌన ప్రతిజ్ఞ) నిర్వహించారు. 'ఉత్తరాఖండ్ ఆధ్యాత్మిక రాష్ట్రం' అని ఆయన అన్నారు. 'పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు, మహిళలు సహా 50 వేల మంది ప్రజలు తమ ఇళ్లను ఖాళీ చేసి రోడ్లపైకి రావడానికి బలవంతం చేస్తే, అది చాలా బాధాకరమైన దృశ్యం' అని తెలిపారు. హల్ద్వానీలో రైల్వే భూమి నుంచి ఆక్రమణను తొలగించాలని హైకోర్టు ఆదేశించిన తర్వాత ప్రజలు వీధుల్లో నిరసనలు చేస్తున్నారు. 'ముఖ్యమంత్రి రాష్ట్రానికి కాపలాదారు. నా ఒక గంట మౌనవ్రతం (పుష్కర్ సింగ్ ధామి) కి అంకితం' అని ఆయన అన్నారు. అయితే ఆయన ప్రతిస్పందించలేదు. కానీ పోలీసులు, పౌర పరిపాలన కోర్టు ఉత్తర్వును అనుసరించాలని చెప్పారు. 'సులభంగా అమలు చేయడానికి మేము ఈ ప్రాంతాన్ని జోన్‌లుగా విభజించాము' అని ప్రాంతీయ పోలీసు ప్రధానాధికారి నీలేష్ ఎ భర్నే ఒక ఆంగ్ల వార్తా సంస్థకు తెలిపారు. ఇదిలాఉండగా, రైల్వే సమయం, ఉద్దేశాన్ని నివాసితులు ప్రశ్నిస్తున్నారు. 'నేను ఈ రోజు ఇక్కడ ఉన్నాను. రేపు అక్కడ ఉండకపోవచ్చు. ఇది నా పిల్లలు, మనవరాళ్ల గురించి నేను ఆందోళన చెందుతున్నాను' అని నిరసనకారులలో ఒకరైన 70 ఏళ్ల ఖైరునిసా అన్నారు. 'మా ఇల్లు కూల్చివేస్తే ఎక్కడకు వెళ్లాలి. ఈ భూమిలో ఇళ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు నిర్మించిన తర్వాత మాత్రమే రైల్వేలు మేల్కొంటాయా?' అని ప్రశ్నించారు. జిల్లా మేజిస్ట్రేట్ ధీరజ్ ఎస్.గార్బ్యాల్ మాట్లాడుతూ 'ప్రజలు ఇక్కడ రైల్వే భూమిలో ఉంటారు. వారిని తొలగించాలి. దీని కోసం మా సన్నాహాలు జరుగుతున్నాయి. త్వరలో వారిని తొలగిస్తాము' అని తెలిపారు. 1,000 మంది విద్యార్థులను కలిగి ఉన్న ప్రభుత్వ బాలికల ఇంటర్ కళాశాల కూల్చివేతకు గురయ్యే అవకాశం ఉందని ఒక ఆంగ్ల వార్తా సంస్థ పేర్కొంది. ఈ సంస్థ 1952లో జూనియర్ హైస్కూల్‌గా వచ్చిందని, 2005లో ఇంటర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయిందని సిబ్బంది ఒకరు చెప్పారు. 2 వేల మందికి పైగా విద్యార్థులు ప్రభావితమవుతారని పరిపాలన యంత్రాంగం అంగీకరించింది.

ప్రస్తుతానికి వాటిని సమీపంలోని మరో ప్రాంతంలో ప్రీఫ్యాబ్రికేటెడ్ నిర్మాణాల్లోకి మార్చాలనేది ప్రణాళిక. రైల్వే భూమిలో ఇంత పెద్ద ఎత్తున నిర్మాణానికి ఎలా అనుమతి లభించిందనే దాని గురించి డివిజనల్ రైల్వే అధికారి వివేక్ గుప్తా మాట్లాడుతూ 'ఇది (రైల్వే లైన్ల వెంబడి ఆక్రమణ) దేశవ్యాప్త సమస్య. దీనికి మేము చింతిస్తున్నాము'. 2013లో ఈ ప్రాంతం సమీపంలోని నదిలో అక్రమ ఇసుక తవ్వకాలపై పిటిషన్ దాఖలు కాగా, ఈ వ్యవహారం కోర్టుకు చేరింది.

సోనియాకు అస్వస్థత...ఆస్పత్రిలో చేరిక

న్యూదిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ అస్వస్థతకు గురయ్యారు. ఆమెను దిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సోనియా కుమార్తె ప్రియాంకా గాంధీ ఆమెతో పాటు ఆసుపత్రికి వెళ్లారు. అయితే సాధారణ వైద్య పరీక్షల నిమిత్తమే ఆమె ఆసుపత్రికి వెళ్లారని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక సీనియర్ నేత చెప్పారు. మరోవైపు 76 ఏళ్ల సోనియాగాంధీ శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో బాధపడుతున్నారని పీటీఐ వార్తాసంస్థ వెల్లడించింది. మంగళవారం నుంచి ఆమె ఆరోగ్యం బాగోలేదని తెలిపింది. మరో వైపు మంగళవారం సాయంత్రం రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ఉత్తరప్రదేశ్ లోకి ప్రవేశించింది. తమ తల్లికి ఆరోగ్యం బాగోలేదనే విషయం తెలిసిన వెంటనే ఏడు కిలోమీటర్ల నడక అనంతరం రాహుల్, ప్రియాంక దిల్లీకి వచ్చారు. సోనియా అనారోగ్యంపై కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందిస్తూ... ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సోనియా అనారోగ్యంపాలయ్యారనే వార్తను వినడం బాధాకరమని చెప్పారు.

అంజలిసింగ్ కుటుంబానికి సిసోడియా పరామర్శ

న్యూదిల్లీ: నూతన సంవత్సరం రోజున దిల్లీ శివారులో కారు ఢీకొని దుర్మరణం చెందిన అంజలిసింగ్ కుటుంబాన్ని ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా బుధవారం పరామర్శించారు. ఆమె బంధువుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. 'ఇది భయంకరమైన క్రూరత్వానికి సంబంధించిన సంఘటన. ఆమె కుటుంబ సభ్యులలో ఒకరికి మేము ఉద్యోగం కల్పిస్తాము' అని చెప్పారు. గత ఆదివారం (జనవరి ఒకటి) తెల్లవారుజామున అంజలి తన స్నేహితురాలితో కలిసి స్కూటర్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా సుల్తాన్‌పురి నుంచి కంఝావ్లా వెళ్లే రోడ్డులో ఈ ఘటన జరిగింది. అంజలీ సింగ్ నడుపుతున్న స్కూటీని ఢీకొట్టిన కారు... ఆమెను 12 కిలోమీటర్లు ఈడ్చుకెళ్లింది. ఆమె మృతదేహం ఔటర్ దిల్లీలోని కంఝావాలాలో లభ్యమైంది.

గూగుల్‌కు జరిమానా

న్యూదిల్లీ: కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)విధించిన రూ.1337.76 కోట్ల జరిమానాలో 10 శాతం మొత్తాన్ని చెల్లించాలని ది నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ గూగుల్‌ను ఆదేశించింది. గూగుల్ అప్పీల్‌ను విచారణకు స్వీకరించిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం... మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించింది. ఇతరుల వాదనలు విన్నాక పూర్తిస్థాయి ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ మేరకు సీసీఐకి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి 13కి వాయిదా వేసింది. ఆండ్రాయిడ్ మొబైల్ విభాగంలో తన గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ గతేడాది అక్టోబర్‌లో గూగుల్‌కు సీసీఐ రూ.1337.76 కోట్ల జరిమానా విధించింది. అనైతిక వ్యాపార పద్ధతులు మానుకోవాలని సూచించింది. దీనిపై గూగుల్ సీసీఐని ఆశ్రయించింది. పెనాల్టీపై స్టే విధించాలని కోరింది. ఆండ్రాయిడ్ వల్ల భారత యూజర్లు, మొబైల్ తయారీ కంపెనీలు ప్రయోజనం పొందుతున్నాయని, భారత డిజిటల్ ప్రయాణంలో ఆండ్రాయిడ్ కీలక పాత్ర పోషించిందని పేర్కొంది. సీసీఐ ఉత్తర్వులతో ఆ ప్రయోజనాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని తెలిపింది. దేశంలో ఎలాంటి విచారణ జరపకుండా యూరోపియన్ కమిషన్ ఇచ్చిన ఆదేశాలను సీసీఐ డైరెక్టర్ జనరల్ కాపీ కొట్టారని తీవ్ర ఆరోపణలు చేసింది. కాబట్టి సీసీఐ ఆదేశాలు కొట్టివేయాలని కోరింది. అయితే, గూగుల్ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న ట్రిబ్యునల్.. స్టే ఇచ్చేందుకు నిరాకరించింది.

గుజరాత్ సీఆర్పీసీ సవరణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూదిల్లీ: క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ)లోని సెక్షన్ 144ను ఉల్లంఘించి నిరసనలకు దిగేవారిపై క్రిమినల్ కేసుల నమోదును సులభతరం చేస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. గత ఏడాది మార్చిలో సీఆర్పీసీ సవరణ బిల్లు-2021ని రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది. సెక్షన్-144 కింద జారీచేసిన నిషేధిత ఉత్తర్వులను ఉల్లంఘిస్తే భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్ 188 కింద గుర్తించదగిన నేరంగా పరిగణించాలని బిల్లులో పేర్కొన్నారు. సంబంధిత ప్రభుత్వ సేవకుడి రాతపూర్వక ఫిర్యాదుపై తప్ప, ప్రభుత్వ సేవకుల చట్టబద్ధ అధికారాన్ని ధిక్కరించే ఎటువంటి నేరపూరిత కుట్రను ఏ కోర్టు పరిగణనలోకి తీసుకోదని సీఆర్పీసీ సెక్షన్ 195 పేర్కొంది.

దీనిని బిల్లు సవరించింది. సీఆర్పీసీ గుజరాత్ సవరణ బిల్లుపై రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసినట్లు హోంమంత్రిత్వ శాఖ అధికారి తెలిపారు. బిల్లులోని నిబంధనల ప్రకారం... గుజరాత్ ప్రభుత్వం, పోలీసు కమిషనర్లు, జిల్లా మేజిస్ట్రేట్‌లు సీఆర్పీసీ సెక్షన్ 144 ప్రకారం నిషేధిత ఉత్తర్వులు జారీ చేసే అధికారం కలిగి ఉంటారు. ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించకుండా, వివిధ సందర్భాలలో శాంతిభద్రతలను కాపాడేందుకు ఏ వ్యక్తినయినా ఒక నిర్దిష్ట చర్యకు దూరంగా ఉండాలని లేదా కొన్ని ఆదేశాలను పాటించాలని నిర్దేశిస్తారు.

ఎంపీ సర్కార్‌పై పదివేల కోట్లకు దావా

ఇండోర్: మధ్యప్రదేశ్ ప్రభుత్వంపై ఓ గిరిజనుడు కోర్టుకు ఎక్కాడు. కంతూ అలియాస్ కంతూలాల్ బీల్(35)ను సామూహిక అత్యాచారం కేసులో నిందితుడనే ఆరోపణలతో పోలీసులు జైలుకు పంపారు. ఓ వివాహితను మరో ఇద్దరితో కలిసి అత్యాచారం చేశాడనే అభియోగం 2018 అక్టోబర్‌లో అతడిపై నమోదైంది. 2020 డిసెంబర్ 23 నుంచి రెండేళ్లపాటు శిక్ష అనుభవించాడు. 666 రోజుల శిక్ష తర్వాత.. అతను అమాయకుడని తేలడంతో విడుదలయ్యాడు. అత్యాచార అభియోగాలతో అన్యాయంగా తనను రెండేళ్లపాటు జైల్లో ఉంచారంటూ అతను వాపోయాడు. అయితే.. నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కోవడం, జైలు శిక్ష తన జీవితాన్ని తలకిందులు చేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. 'దేవుడు ప్రసాదించిన జీవితంలో ఎన్నో విలువైన క్షణాలను దూరం చేసుకున్నా' అంటూ పిటిషన్‌లో పేర్కొన్నాడు. పరిహారంగా10,006 కోట్ల రూపాయలకు అతను ప్రభుత్వంపై దావా వేశాడు.

త్రిపురలో సీపీఎం-బీజేపీ కార్యకర్తల ఘర్షణ

గోమతి: త్రిపురలోని గోమతి జిల్లాలో సీపీఎం-బీజేపీ మద్దతుదారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్ పూర్వీకుల నివాసం సమీపంలో జరిగిన ఈ ఘటనలో ఇద్దరు గాయపడినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. జామ్‌జూరి ప్రాంతంలో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో ప్రమేయం ఉందన్న ఆరోపణలపై ఒకరిని అరెస్టు చేసినట్లు ఉదయపూర్ సబ్-డివిజనల్ పోలీసు అధికారి నిరుపమ్ దత్తా తెలిపారు. పోలీసులు ఈ ఘటనను సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.పరిస్థితి అదుపులో ఉందని, ఒకరిని అదుపులోకి తీసుకున్నామని, విచారణ కొనసాగుతోందని ఎస్‌డీపీవో తెలిపారు. జామ్‌జూరిలోని వారి పూర్వీకుల ఇంట్లో దేవ్ తండ్రి వర్ధంతి సందర్భంగా నాలుగు రోజుల యజ్ఞం బుధవారం ప్రారంభమైంది. బీజేపీ కార్యకర్తలు ఇంటిని, చుట్టుపక్కల ప్రాంతాలను అలంకరించారు. అదే సమయంలో సీపీఎం మద్దతుదారుల బృందం అక్కడ వారి కార్యక్రమానికి పార్టీ జెండాలను ఏర్పాటు చేసింది. బీజేపీ కార్యకర్తలు అత్యుత్సాహంతో సీపీఎం జెండాలు చింపివేయడంతో ఘర్షణ జరిగింది. దీనికి ప్రతిగా సీపీఎం మద్దతుదారులు ఓ వాహనాన్ని తగులబెట్టారు. ఇద్దరు బీజేపీ కార్యకర్తలు గాయపడ్డారు' అని ఎస్‌డీపీవో తెలిపారు. దీంతో ఆగ్రహించిన బీజేపీ కార్యకర్తలు సీపీఎం కార్యకర్తల నాలుగు దుకాణాలకు నిప్పుపెట్టారని, భద్రతా బలగాలు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చాయని, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అక్కడ పోలీసు సిబ్బందిని మోహరించినట్లు ఆయన వివరించారు.

జోడో యాత్రలో బీజేపీ నేత

న్యూదిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్రలో పాల్గొనాలని ఆ పార్టీ నేత ఆచార్య ప్రమోద్ కృష్ణమ్ ఇచ్చిన పిలుపుపై బీజేపీ నేత షెహజాద్ పూనావాలా బుధవారం స్పందించారు. దేశాన్ని ముక్కలు చేయాలనుకునే టుకడే-టుకడే గ్యాంగ్, ఆవులను వధించేవారు, శ్రీరాముడి జననం, ఉనికిలను ప్రశ్నించేవారు ఈ యాత్రలో పాల్గొనకపోతే, తాను పాల్గొంటానని చెప్పారు. షెహజాద్ పూనావాలా అంతకుముందు ఆచార్య ప్రమోద్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమోద్ స్పందిస్తూ, భారత్ జోడో యాత్రలో పాల్గొనాలని ఆహ్వానించారు. దీనిపై పూనావాలా స్పందిస్తూ ఇచ్చిన ట్వీట్‌లో, భారత దేశాన్ని ముక్కలు చేయాలనుకునేవారు, పార్లమెంటుపై దాడి చేసిన అఫ్జల్ గురుకు మద్దతిచ్చేవారు, హిందుత్వాన్ని ఐసిస్ ఉగ్రవాద సంస్థతో పోల్చేవారు, ఆవులను చంపేవారు, శ్రీరాముడి ఉనికి, జననాలను ప్రశ్నించేవారు, జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని అధికరణ 370ని పునరుద్ధరించాలని కోరేవారు ఈ యాత్రలో పాల్గొనకపోతే, తాను కచ్చితంగా పాల్గొంటానని చెప్పారు.

శభాష్ రాహుల్: చంపత్ రాయ్

లక్నో : భారత్ జోడో యాత్ర చేస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని అయోధ్య రామాలయం ట్రస్ట్ కార్యదర్శి చంపత్ రాయ్ ప్రశంసించారు. దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్న 'ఈ యువకుడికి' ధన్యవాదాలని, ఆయన కృషిని మెచ్చుకుంటున్నానని, అందులో తప్పేమీ లేదన్నారు.

రాహుల్ గాంధీ యాత్ర గురించి విలేకర్లు ప్రశ్నించినపుడు చంపత్ రాయ్ స్పందిస్తూ, రాహుల్ ఎంతో ఇబ్బందికర వాతావరణంలో పాదయాత్ర చేస్తున్నారని, దీనిని తప్పనిసరిగా మెచ్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దేశవ్యాప్తంగా యాత్ర చేయాలన్నారు. తాను ఆరెస్సెస్ కార్యకర్తనని, భారత్ జోడో యాత్రను ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ ఖండించలేదని తెలిపారు.

జోడో యాత్ర విజయవంతమవుతుంది: సత్యేంద్ర దాస్, అయోధ్య రామమందిరం ప్రధాన అర్చకులు

లక్నో : అందరి క్షేమాన్ని కాంక్షించి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని అయోధ్య రామమందిరం ప్రధాన అర్చకులు సత్యేంద్ర దాస్ తెలిపారు. ఈయనకు కూడా భారత్ జోడో యాత్రలో పాల్గొనాలంటూ కాంగ్రెస్ నుంచి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా సత్యేంద్ర, రాహుల్‌కు లేఖ రాశారు. 'మీ ఆశయాలకు అనుగుణంగా చేపట్టిన భారత్ జోడో యాత్ర తప్పనిసరిగా విజయవంతం కావాలని కోరుకుంటున్నాను. ఏ దేశం కోసమైతే మీరు ఈ యాత్ర చేపట్టిరో మీకు రాముడు సర్వ విధాలా రక్షగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను' అని తెలిపారు.

మార్చిలో జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు?

శ్రీనగర్: కేంద్ర పాలిత జమ్ముకశ్మీర్‌లో నియోజకవర్గాల పునర్విభజన, ఫోటో ఓటర్ల జాబితా సవరణ కసరత్తు పూర్తవడంతో ఈ ఏడాది మార్చి-ఏప్రిల్‌లో తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ మేరకు ఫొటోతో కూడిన ఓటర్ల జాబితా సవరణ సహా ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని బీజేపీ ప్రధాన కార్యదర్శి అశోక్ కౌల్ తెలిపారు. 'శీతాకాలం తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని భావిస్తున్నారు. మార్చి-ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించవచ్చు' అని కౌల్ చెప్పారు. అక్టోబరు-నవంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందా అని అడిగిన ప్రశ్నకు, 'మార్చి-ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించగలిగినప్పుడు, అక్టోబర్-నవంబర్ వరకు ఎందుకు వేచి ఉండాలి' అని ఆయన బదులిచ్చారు. ఈ ఏడాది ఎన్నికలు జరగాల్సిన మరో 11 రాష్ట్రాలతో పాటు జమ్ముకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయో లేదో చూడాలి. జమ్ముకశ్మీర్‌లో శాంతిభద్రతలు అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు తగిన విధంగా సంతృప్తికరంగా ఉన్నాయని హోంమంత్రి అమిత్ షా గత ఏడాది నవంబర్‌లో చెప్పారు. మరో కశ్మీర్ బీజేపీ నాయకుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి కవీందర్ గుప్తా కూడా ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన కసరత్తు గత ఏడాది మేలో పూర్తి కాగా, నవంబర్‌లో ప్రత్యేక ఫొటో ఓటర్ల జాబితా సవరణ పూర్తయింది. ఎన్నికల సన్నద్ధతపై పార్టీ అధిష్ఠానం నుంచి ఆదేశాలందాయా అని అడగ్గా బీజేపీ ఎప్పుడూ ఎన్నికలకు సిద్ధంగా ఉంటుందని గుప్తా పేర్కొన్నారు. రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత జమ్ముకశ్మీర్ కేంద్రపాలిత ప్రాతం కేంద్రం ప్రత్యక్ష నియంత్రణలో ఉండే లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలో ఉంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత, జమ్ముకశ్మీర్ అసెంబ్లీ స్థానాల సంఖ్య 83 నుంచి 90కి పెరిగింది.

దిల్లీ కారు ప్రమాదం మృతురాలి శరీరంపై 40 గాయాలు

న్యూదిల్లీ: దిల్లీ కారు ప్రమాద ఘటనకు సంబంధించి శవపరీక్షలో భయానక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మృతురాలు అంజలి శరీరంపై 40 గాయాలు ఉన్నాయి. యువతి శరీరం కారు చక్రాల్లో చిక్కుకొని కిలోమీటర్ల దూరం ఈడ్చుకుపోవడంతో వెనకభాగం పూర్తిగా ఛిద్రమైంది. దాంతో పక్కటెముకలు బయటకు వచ్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. తలభాగం తీవ్రంగా దెబ్బతిన్నట్లు పేర్కొన్నాయి. వెన్నెముక, కాళ్లకు గాయాలయ్యాయి. ప్రమాదంతో దిగ్భ్రాంతికి గురవ్వడం, తీవ్ర రక్తస్రావం వల్లే యువతి మృతి చెందినట్లు నివేదిక పేర్కొంది. ఆమెపై ఎలాంటి లైంగిక దాడి జరగలేదని పరీక్షలో తేలింది. కొత్త సంవత్సరం మొదటి రోజు తెల్లవారుజామున దేశ రాజధాని దిల్లీలో స్కూటీపై వెళ్తున్న యువతిని కారుతో ఢీకొట్టి కిలోమీటర్ల మేర ఈడ్చుకెళ్లిన ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆదివారం ప్రమాదం జరిగిన సమయంలో అంజలి ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనంపై మరో యువతి ఉన్నట్లు సీసీటీవీల పరిశీలన ద్వారా పోలీసులు గుర్తించారు. ఆమె వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. ప్రమాదం జరిగిన రాత్రి కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా అంజలి, తాను కొంతమంది స్నేహితులను కలిసేందుకు ఓ హోటల్‌కు వెళ్లినట్లు ఆమె తెలిపింది. పార్టీ అనంతరం మద్యం సేవించి ఉన్నప్పటికీ అంజలి స్కూటర్ నడిపిందని.. తాను వారించినా వినలేదని స్నేహితురాలు చెప్పింది. ప్రమాదం జరిగిన వెంటనే తాను భయంతో అక్కడి నుంచి పారిపోయినట్లు వెల్లడించింది. అయితే కారు కింద ఓ మహిళ చిక్కుకుపోయిందని అందులోని వ్యక్తులకు తెలిసినా.. ఆమెను రక్షించేందుకు వారు కారును ఆపలేదని చెప్పింది.

మద్యం మత్తులో మహిళపై మూత్రవిసర్జన

న్యూదిల్లీ: విమానంలో ఓ ప్రయాణికుడు మద్యం మత్తులో అసభ్యంగా ప్రవర్తించాడు. బిజినెస్ క్లాసులో తోటి ప్రయాణికురాలిపై మూత్ర విసర్జన చేశాడు. సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విమానం దిగి వెళ్లిపోయాడు. గతేడాది నవంబరు 26న ఎయిరిండియా విమానంలో జరిగిన ఈ దిగ్భ్రాంతికర ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 70 ఏళ్ల పైబడిన ఓ వృద్ధురాలు బిజినెస్ క్లాసులో ఉండగా.. మద్యం మత్తులో ఉన్న ఓ ప్రయాణికుడు ఆమె సీటు దగ్గరకు వచ్చి ఆమెపై మూత్రవిసర్జన చేశాడు. ఆ తర్వాత అక్కడి నుంచి కదలకపోవడంతో మరో ప్రయాణికుడు అతనిని బలవంతంగా పంపించారు. భోజనం తర్వాత విమానంలో లైట్లు ఆర్పేసిన సమయంలో ఈ ఘటన జరిగింది. ఆ మహిళ విమాన సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ప్రయాణికుడి చర్య కారణంగా తన దుస్తులు, బ్యాగు తడిచిపోయాయని తెలిపారు. దీంతో సిబ్బంది ఆమెకు మరో జత దుస్తులు, స్లిప్పర్స్ ఇచ్చారు. కానీ ఆ ప్రయాణికుడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎయిరిండియా విమాన సిబ్బంది తీరుతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ మహిళ...ఘటన జరిగిన మరుసటి రోజు ఆ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌కు లేఖ రాశారు. 'తడిచిపోయిన సీట్లో నేను కూర్చోలేనని చెప్పడంతో సిబ్బంది కూర్చునే సీటు కేటాయించారు. గంట తర్వాత నన్ను తిరిగి నా సీట్లోకి వెళ్లిపొమ్మన్నారు. షీట్లతో కవర్ చేసి, స్ప్రే చేసినా వాసన పోలేదు. నేను కూర్చోలేనని చెప్పడంతో తిరిగి సిబ్బంది కూర్చునే సీట్లోకే పంపించారు. బిజినెస్ క్లాసులో సీట్లు ఖాళీగా ఉన్నా నాకు కేటాయించలేదు' అని ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ తర్వాత ఎయిరిండియా ఓ అంతర్గత కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎయిర్‌లైన్ విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దీనిపై తాజాగా ఎయిర్‌లైన్స్ స్పందించింది. ఆ ప్రయాణికుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది.

వైద్యుడి నిర్వాకం... మహిళ కడుపులో టవల్

డెహ్రాడూన్: ప్రసవ వేదనతో ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చిన మహిళ కడుపులో టవల్ ఉంచేసి నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేసిన వైద్యుడి నిర్వాకం వెలుగు చూసింది. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాలోని బాన్స్ ఖేరీ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్లే... నజరానా అనే మహిళ ప్రసవ వేదనతో సైఫీ నర్సింగ్ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా...డాక్టర్ మత్లూబ్ ఆమె కడుపులో టవల్ ఉంచేసి ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత మహిళకు కడుపు నొప్పి ఎక్కువ కావడంతో తాళలేక డాక్టర్‌కి ఫిర్యాదు చేసింది. అయితే బయట చలి ఎక్కువగా ఉండటం వల్లే అలా అనిపిస్తోందని చెప్పి మరో ఐదు రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉంచేశారు. తిరిగి ఇంటికి వచ్చినా..ఆరోగ్యం మెరుగవ్వకపోవడంతో..భర్త షంషేర్ అలీ ఆమెను అమ్రోహాలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. అక్కడ అసలు విషయం తెలుసుకుని బాధితురాలి భర్త అలీ తెల్లబోయాడు.

బాధితురాలి కడుపులో టవల్ ఉందని, ఆపరేషన్ చేసి తీసేసినట్లు అక్కడి ఆస్పత్రి వైద్యులు అలీకి తెలిపారు. దీంతో అలీ చీఫ్ మెడికల్ ఆఫీసర్(సీఎంఓ)కు ఆ ఆస్పత్రి నిర్వాకంపై ఫిర్యాదు చేశాడు. మీడియా కథనాల ద్వారా విషయం తెలుసుకున్న చీఫ్ మెడికల్ ఆఫీసర్(సీఎంఓ) రాజీవ్ సింఘాల్ ఈ విషయంపై సమగ్ర విచారణ చేయమని నోడల్ అధికారి డాక్టర్ శరద్‌ను ఆదేశించారు. అయితే అలీ ఈ విషయమై లిఖితపూర్వకంగా తనకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలిపారు. విచారణ నివేదిక రాగానే పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభిస్తారని సీఎంవో అధికారి సింఘాల్ చెప్పారు. వైద్యుడు మత్లూబ్ అమ్రోహాలో సైఫీ నర్సింగ్ హోమ్‌ని ఎలాంటి అనుమతి లేకుండా నడుపుతున్నట్లు తేలింది.

బీజేపీ నేత హోటల్ కూల్చివేత

ఇండోర్: బీజేపీ బహిష్కృత నాయకుడు మిశ్రీ చంద్ర గుప్తా అక్రమ హోటల్‌ను మధ్యప్రదేశ్ అధికారులు కూల్చేవేశారు. డిసెంబర్ 22న జగదీశ్ యాదవ్ అనే వ్యక్తిని హత్య చేసినట్లు చంద్ర గుప్తా, అతని కుటుంబ సభ్యులపై ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు పోలీసులు మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. అందులో ఐదుగురిని అరెస్టు చేయగా, చంద్ర గుప్తా పరారీలో ఉన్నారు. అయితే దర్యాప్తులో చంద్ర గుప్తా పేరిట ఉన్న హోటల్ అక్రమంగా కట్టిందని అధికారులు గుర్తించారు. దీంతో, ఇండోర్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ఆ అక్రమ హోటల్ జైరామ్ ప్యాలస్‌ని సుమారు 60 డైనమైట్‌లను ఉపయోగించి కూల్చేసింది. సెకండ్ల వ్యవధిలో హోటల్ నేలమట్టమైంది. అందుకు సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్ అయ్యాయి. సాగర్ జిల్లా కలెక్టర్ దీపక్ ఆర్య స్వయంగా కూల్చివేత ఏర్పాట్లు పర్యవేక్షించారు. భద్రత దృష్ట్యా కూల్చివేత సమయంలో హోటల్ కూడలి చుట్టూ బారికేడ్లు వేసి ట్రాఫిక్‌ను నిలిపేశారు. హోటల్ చుట్టూ ఉన్న భవనాల్లో నివశించే ప్రజలను అప్రమత్తం చేశారు. ఎలాంటి నష్టం జరగలేదని, కేవలం భవనం మాత్రమే కూలిందని కలెక్టర్ ఆర్య ప్రకటించారు. హత్యకు గురైన జగదీశ్ యాదవ్ స్వతంత్ర కౌన్సిలర్ కిరణ్ యాదవ్ మేనల్లుడు. కిరణ్ యాదవ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్ర గుప్తా భార్య మీనాను 83 ఓట్ల ఆధిక్యంతో ఓడించాడు.

చొక్కా తొలగించమన్నారు: మహిళ

అవాస్తవమన్న ఎయిర్‌పోర్టు సిబ్బంది

బెంగళూరు: విమానాశ్రయంలో తనిఖీల సమయంలో భద్రతా సిబ్బంది తన చొక్కా తొలగించమన్నారని ఓ మహిళ ట్విటర్ వేదికగా ఆరోపణలు చేసింది. అయితే ఈ ఆరోపణలు అవాస్తవమని సమాచారం. కర్ణాటకలోని బెంగళూరు విమానాశ్రయంలో ఈ ఘటన జరిగింది.

సీఐఎస్ఎఫ్ వర్గాలు వెల్లడించిన ప్రకారం.. ఆమె బ్యాడ్జ్‌లు, పూసలతో పొదిగిన డెనిమ్ జాకెట్ ధరించింది. కర్టెన్ల వెనకే ఆమెను పరీక్షించారు. అలాగే ఆ చొక్కాను స్కానర్ దగ్గరకు తెచ్చేవరకు వేచి ఉండమని మహిళా సిబ్బంది చెప్పినప్పటికీ.. ఉన్న దుస్తులతో తనకు సౌకర్యంగానే ఉందని సదరు మహిళ బయటకు వచ్చిందని సమాచారం. మంగళవారం సాయంత్రం ఆ మహిళ చేసిన ట్వీట్‌తోనే అసలు సమస్య మొదలైంది. 'బెంగళూరు ఎయిర్‌పోర్టులో తనిఖీల సమయంలో నా చొక్కాను తొలగించమన్నారు. సెక్యూరిటీ చెక్ పాయింట్ దగ్గర అలా నిల్చోవడం అవమానకరంగా అనిపించింది' అంటూ విమానాశ్రయ వర్గాలను ట్యాగ్ చేస్తూ విమర్శలు చేసింది. బుధవారం ఆ ట్వీట్‌ను తొలగించింది. ఖాతాను డీ యాక్టివేట్ చేసింది. ఇదిలా ఉంటే.. ఈ ఘటనపై విమానాశ్రయ అధికారులు కూడా స్పందించారు.

ఇది జరిగి ఉండాల్సింది కాదని, మొత్తం వివరాలు అందజేయాలని ఆమెకు సమాధానం కూడా ఇచ్చారు. కాగా ఇవన్నీ తప్పుడు ఆరోపణలంటూ సీఐఎస్ఎఫ్ వర్గాలు చెప్పిన వివరాలను ఓ మీడియా సంస్థ వెల్లడించింది.

కుమార్తెకు పెళ్లయినా హోదా మారదు

కర్ణాటక హైకోర్టు సంచలన తీర్పు

బెంగళూరు: పెళ్లయిన కుమారుడి హోదా కుమారుడిగానే ఏ విధంగా కొనసాగుతుందో, పెళ్లయిన కుమార్తె హోదా కూడా కుమార్తెగానే కొనసాగుతుందని కర్ణాటక హైకోర్టు జనవరి 2న తీర్పు చెప్పింది. మాజీ సైనికోద్యోగుల పిల్లలకు అందజేసే డిపెండెంట్ కార్డులను పొందే అర్హత వివాహిత కుమార్తెలకు లేదని చెబుతున్న సైనిక సంక్షేమ మండలి మార్గదర్శకాలను రద్దు చేసింది. జస్టిస్ ఎం నాగప్రసన్న నేతృత్వంలోని కర్ణాటక హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ జనవరి 2న ఇచ్చిన తీర్పులో, "కుమారుడు పెళ్లయినా, కాకపోయినా కుమారునిగానే కొనసాగుతున్నపుడు, కుమార్తె పెళ్లయినా, కాకపోయినా, కుమార్తెగానే కొనసాగాలి. కుమారుని హోదాను వివాహం మార్చనపుడు, కుమార్తె హోదాను పెళ్లి మార్చకూడదు" అని తెలిపింది. సైనిక దళాల్లో స్త్రీ, పురుష సమీకరణలు మారుతున్నందువల్ల తటస్థంగా ఉండే పదాలను వాడాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. మాజీ సైనికోద్యోగులను ప్రస్తావించేటపుడు ఎక్స్ సర్వీస్‌మెన్ అనే పదానికి బదులుగా ఎక్స్ సర్వీస్ పర్సనల్ అనే పదాన్ని ఉపయోగించాలని తెలిపింది. సుబేదార్ రమేశ్ ఖండప్ప పోలీస్ పాటిల్ 2001లో 'ఆపరేషన్ పరాక్రమ్'లో భాగంగా మందుపాతరలను తొలగిస్తుండగా అమరుడయ్యారు. ఆయన కుమార్తె ప్రియాంక పాటిల్ డిపెండెంట్ కార్డ్ కోసం ప్రయత్నించారు. కానీ ఆమెకు ఆ కార్డు మంజూరు కాలేదు. దీంతో ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సుబేదార్ రమేశ్ మరణించేనాటికి ప్రియాంక వయసు 10 సంవత్సరాలు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల ప్రక్రియ జరిగింది. మాజీ సైనికోద్యోగుల పిల్లలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు నిబంధనలు పేర్కొన్నాయి. దీంతో ఆమె డిపెండెంట్ కార్డ్ కోసం ప్రయత్నించారు. ఈ కార్డును మంజూరు చేయడానికి సైనిక సంక్షేమ మండలి తిరస్కరించింది. ఆమెకు వివాహమైనందున ఈ కార్డును మంజూరు చేయబోమని తెలిపింది. వివాహం కాని మహిళలకు మాత్రమే డిపెండెంట్ కార్డులను మంజూరు చేయాలని నిబంధనలు చెబుతున్నట్లు తెలిపింది. దీంతో ఆమె 2021లో హైకోర్టును ఆశ్రయించారు. మహిళలకు డిపెండెంట్ కార్డుల జారీ విషయంలో సైనిక సంక్షేమ మండలి నిబంధనలు భారత రాజ్యాంగంలోని అధికరణలు 14, 15లకు విరుద్ధంగా ఉన్నట్లు జస్టిస్ నాగ ప్రసన్న తన తీర్పులో చెప్పారు. దశాబ్దాల క్రితం అమల్లో ఉన్న మూస ఆలోచనా విధానం ఈ నిబంధనల్లో కనిపిస్తోందన్నారు. ఈ నిబంధనలను ఇలాగే కొనసాగనిస్తే, స్త్రీ, పురుష సమానత్వాన్ని సాధించే మార్గంలో కాలం చెల్లిన అడ్డంకులుగా నిలుస్తాయన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కోసం 2021 ఆగస్టు 26న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ప్రియాంకకు రిజర్వేషన్ ఫలాలను అందజేసే విషయాన్ని పరిశీలించాలని కర్ణాటక ఎగ్జామినేషన్ అథారిటీని జస్టిస్ ఎం నాగ ప్రసన్న ఆదేశించారు.

చింతాదేవి స్ఫూర్తిప్రదాత

గయా డిప్యూటీ మేయర్‌కు సీపీఐ అభినందన-సన్మానం

న్యూఢిల్లీ: బీహార్ గయా డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన పారిశుద్ధ్య కార్మికురాలు చింతా దేవిని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఘనంగా సన్మానించింది. ఆమె ఎన్నిక స్ఫూర్తిదాయమని కొనియాడింది. నిబద్ధతగల సీపీఐ సైనికురాలు చింతాదేవి అని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. స్వీపర్ స్థాయి నుంచి పారిశుద్ధ్య కార్మికుల సంఘానికి నాయకత్వం వహించే స్థాయికి ఎదిగి... ఇప్పుడు గయా డిప్యూటీ మేయర్‌గా ఎన్నికవ్వడం ఆమె పట్టుదల, శ్రమకు నిదర్శనమని కొనియాడారు. గయా డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనందుకు అభినందనలు తెలిపారు. దుశ్శాలువా, పూలమాలతో ఆమెను సన్మానించారు. చింతాదేవి 40ఏళ్లు పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేశారు. రోడ్లు ఊడ్చారు. మరుగుదొడ్డు శుభ్రం చేశారు. ఇటీవల జరిగిన బీహార్ స్థానిక ఎన్నికల్లో డిప్యూటీ మేయర్‌గా పోటీ చేసి 16వేలఓట్లతో గెలిచి చరిత్రకెక్కారు. చింతాదేవి 60ఏళ్ల జీవితం ఎన్నో ఒడిదుడుగుల మధ్య సాగింది. తొలుత నామినేషన్ వేసేందుకు కాస్త వెనుకాడిన చింతాదేవికి తోటి కార్మికులు ప్రోత్సహించారు. దీంతో పోటీ చేయడమే కాకుండా ఘన విజయాన్ని చింతా దేవి అందుకోగలిగారు.

యోగి ప్రభుత్వానికి ఊరట

న్యూఢిల్లీ: ఓబీసీ రిజర్వేషన్లతోనే యూపీ పురపాలక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఓబీసీ రిజర్వేషన్ల ప్రసక్తి లేకుండానే యూపీ అర్బన్ బాడీ పోల్స్ నిర్వహించాలంటూ అలహాబాద్ హైకోర్టు డిసెంబర్ 27న ఇచ్చిన సంచలన తీర్పుపై సుప్రీం కోర్టు మంగళవార 'స్టే' ఇచ్చింది. అలహాబాద్ హైకోర్టు తీర్పును డిసెంబర్ 29న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాలు చేసింది. ఇందుకు సంబంధించి స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) వేసింది. దీనిపై భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ విచారణ జరుపుతూ, స్థానిక సంస్థల యంత్రాగానికి విఘాతం కలుగకుండా డెలిగేషన్, ఫైనాన్సియల్ పవర్స్ జారీ చేసే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. దీనిపై సొలిసిటర్ జనరల్ తన వాదన వినిపిస్తూ, కొత్తగా ఏర్పాటు చేసిన కమిషన్ పదవీ కాలం 6 నెలలే అయినప్పటికీ 2023 మార్చి 31కి ముందే ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

ఐదుగురు సభ్యుల కమిషన్ ఏర్పాటు: ఓబీసీ రిజర్వేషన్ లేకుండానే లోకల్ బాడీ ఎన్నికలు జరపాలని అలహాబాద్ హైకోర్టు తీర్పు వెలువరించగానే యోగి ఆదిత్యనాథ్ సైతం అంతే పట్టుదలగా స్పందించారు. రిజర్వేషన్ లేకుండా ఎన్నికలకు వెళ్లేది లేదని స్పష్టం చేశారు. అంతే వేగంగా ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు ఐదుగురు సభ్యుల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. రిటైర్డ్ జస్టిస్ రామ్ అవతార్ సింగ్ సారథ్యంలో ఏర్పాటైన ఈ కమిషన్‌లో రిటైర్డ్ ఐపీస్ అధికారులు చౌబ్ సింగ్ వర్మ, మహేంద్ర కుమార్, రాష్ట్ర మాజీ న్యాయ సలహాదారులు సంతోష్ కుమార్, బ్రిజేష్ కుమార్ సోని సభ్యులుగా ఉన్నారు.

సర్పంచుల సమస్యల పరిష్కారంపై

23న విజయవాడలో రౌండ్‌టేబుల్

సీపీఐ నేత రామకృష్ణకు సర్పంచ్‌ల సంఘం ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ ఛాంబర్‌ల అధ్వర్యంలో ఈ నెల 23న విజయవాడలో జరుగనున్న రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనాల్సిందిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను సంఘ నేతలు ఆహ్వానించారు. ఈ మేరకు విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం రామకృష్ణను ఆయా సంఘాల నేతలు కలిశారు. రాష్ట్రంలో సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం తగు సూచనలు ఇవ్వాల్సిందిగా రామకృష్ణను కోరారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులైన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్మన్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. కేంద్రం విడుదల చేసిన నిధులను గ్రామ పంచాయితీ అభివృద్ధికే వినియోగించాలని కోరుతూ చేపట్టనున్న పోరాటంలో భాగస్వాములు కావాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవీబీ రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్ (వైసీపీ), ఉపాధ్యక్షులు రావిళ్ల సుధాకర్ (వైసీపీ), ఆర్గనైజింగ్ కార్యదర్శి వేల్పుల జయపాల్ (వైసీపీ), రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సన్యాసినాయుడు (జనసేన), రాష్ట్ర అధికార ప్రతినిధి గల్లా తిమ్మతి (జనసేన), రాష్ట్ర కార్యదర్శి కాగిత గోపాలరావు (టీడీపీ), ఆర్గనైజింగ్ కార్యదర్శి ముప్పనేని రవిప్రసాద్ (టీడీపీ), సర్పంచ్ ఎన్.లెనిన్‌బాబు (సీపీఐ) తదితరులు రామకృష్ణను కలిసిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ ఉన్నారు.

సీపీఎం నేత శ్రీనివాసరావుకూ ఆహ్వానం

ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయితీ ఛాంబర్ అధ్వర్యంలో నిర్వహించబోయే అఖిలపక్ష సమావేశానికి హాజరు కావాలని సీపీఎంకు సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉగాదికి 5 లక్షల ఇళ్లు: మంత్రి జోగి రమేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పేదలకు ఇళ్ల పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతోందని మంత్రి జోగి రమేశ్ అన్నారు. ఉగాదికి ఐదు లక్షల ఇళ్లు పూర్తి చేస్తామన్నారు. 20 లక్షల మందితో గృహ ప్రవేశాలు చేయించి వారంతా కుటుంబాలతో కలిసి పండుగ జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. మంత్రి బుధవారం విజయవాడ గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఒకే రోజు ఐదు లక్షల ఇళ్లలో గృహప్రవేశాలతో దేశంలో ప్రత్యేకతను సాధించాలని, ఈ లక్ష్యసాధనకు ప్రతీ ఉద్యోగి కృషిచేయాలని అన్నారు. ఇదొక మహా యజ్ఞమని, బాగా పనిచేస్తే ముఖ్యమంత్రి సభలో అవార్డులిస్తామని చెప్పారు. గృహాల లబ్దిదారులను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి స్వయం సహాయక గ్రూపుల మాదిరి తక్కువ వడ్డీకి బాంకులు ద్వారా రూ.35 వేల ఇప్పించడం ద్వారా ఆర్థికంగా మేలు జరుగుతుందని అన్నారు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన

కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయడానికి ఇంజినీరింగ్ అసిస్టెంట్ నుంచి జిల్లా కలెక్టర్ వరకూ నిరంతరం పనిచేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలలో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, ఆప్షన్-3 లేఅవుట్లలో 36 క్వాలిటీ కంట్రోల్ లాబ్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి గృహనిర్మాణ సంస్థ ప్రత్యేక కార్యదర్శి బీఎం మైదీన్, మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీషా, సంయుక్త ఎండీ ఎం.శివ ప్రసాద్, 26 జిల్లాల గృహనిర్మాణశాఖ అధికారులు, ఇంజినీర్లు హాజరయ్యారు.

26 నుంచి కాంగ్రెస్ పాదయాత్ర: రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్వర్యంలో ఈనెల 26 నుంచి మార్చి 26 వరకు రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపట్టాలని పీసీసీ విస్తృత స్థాయి సమావేశం నిర్ణయించింది. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. 15 రోజులు నగరాల్లోనూ, మరో 15 రోజులు పట్టణాలు, అనంతరం మునిసిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాల్లో తిరిగేలా కార్యాచరణ రూపొందిం చుకుంటున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టంపై జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందని, దళితుల పట్ల చిన్నచూపు చూస్తున్నారన్నారు. మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు మాట్లాడుతూ ఏపీ ప్రత్యేక హోదాను బీజేపీ తుంగలో తొక్కిందన్నారు. పోలవరం కేంద్ర ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉండగా, దానిని గత చంద్రబాబు, ప్రస్తుత జగన్ ప్రభుత్వం నీరుగారుస్తోందన్నారు. పోలవరం నిర్వాసితులకూ దారిచూపలేదని, ప్రోత్సాహకాలు అందించలేని హీన, దీన స్థితిలో జగన్ ప్రభుత్వ ఉందని విమర్శించారు. కాంగ్రెస్ శ్రేణులంతా పాదయాత్రకు మద్దతు తెలపాలన్నారు. అనంతరం విజయనగరం జిల్లాకు చెందిన జనసేన నాయకులు జమ్ము ఆదినారాయణ, కోనసీమ జిల్లా నుంచి అమరా శ్రీనివాస్, వైసీపీ నుంచి ఆదినారాయణ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

రూ.19,744 కోట్లతో జాతీయ హరిత ఉదజని మిషన్

- ప్రసారభారతి బలోపేతానికి చర్యలు
- హిమాచల్ జలవిద్యుత్ ప్రాజెక్టుకు ఆమోదం
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

న్యూఢిల్లీ: కేంద్ర కేబినెట్ బుధవారం కీలక నిర్ణయాలు తీసుకుంది. స్వచ్ఛమైన ఇంధన వనరుల తయారీకి భారతదేశాన్ని అంతర్జాతీయ కేంద్రంగా మార్చే లక్ష్యంతో రూ.19,744 కోట్ల వ్యయంతో జాతీయ హరిత ఉదజని మిషన్‌కు, హిమాచల్ ప్రదేశ్‌లో జల విద్యుత్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. అలాగే ప్రజా సేవల ప్రసార సంస్థ అయిన ప్రసార భారతికి ప్రధాన ప్రోత్సాహకంగా ఆల్ ఇండియా రేడియో (ఆకాశవాణి), దూరదర్శన్‌ను బలోపేతం చేయాలని నిర్ణయించింది. బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ వివరించారు. జాతీయ హరిత ఉదజని మిషన్ కోసం ప్రారంభ వ్యయం రూ.19,744 కోట్లు, ఇందులో దృషి (ఎస్ఐజీహెచ్‌టీ) కార్యక్రమానికి రూ.17,490 కోట్లు, పైలట్ ప్రాజెక్టులకు రూ.1,466 కోట్లు, ఆర్అండ్ఆర్‌డీకి రూ.400 కోట్లు, ఇతర మిషన్ భాగాలకు రూ.388 కోట్లు. కొత్త, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ) పథకం అమలు కోసం మార్గదర్శకాలను రూపొందిస్తుంది. హరిత ఉదజని, దాని ఉత్పన్నాల ఉత్పత్తి, వినియోగం, ఎగుమతి కోసం భారతదేశాన్ని అంతర్జాతీయ కేంద్రంగా మార్చడం ఈ కార్యక్రమం లక్ష్యం. మంత్రి ఠాకూర్ మాట్లాడుతూ 'ఈ మిషన్ విస్తృత ప్రయోజనాలను కలిగి ఉంటుంది. హరిత ఉదజని, ఉత్పన్నాల కోసం ఎగుమతి అవకాశాల సృష్టి, పారిశ్రామిక, చలనశీలత, శక్తి రంగాల డీకార్బనైజేషన్, దిగుమతి చేసుకున్న శిలాజ ఇంధనాలు, ఫీడ్‌స్టాక్‌పై ఆధారపడటాన్ని తగ్గించడం, స్వదేశీ తయారీ సామర్థ్యాల అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి' అని అన్నారు. మిషన్ కింద సమన్వయంతో కూడిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టబడుతుంది. మిషన్ లక్ష్యాలను విజయవంతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధిత మంత్రిత్వ శాఖలు, శాఖలు, ఏజెన్సీలు, సంస్థలు దృష్టి సారించి, సమన్వయంతో చర్యలు తీసుకుంటాయని మంత్రి చెప్పారు. భారతదేశం హరిత ఉదజని ఉత్పత్తి సామర్థ్యం సంవత్సరానికి కనీసం 5 మిలియన్ టన్నులకు చేరుకునే అవకాశం ఉందని, దీని అనుబంధిత పునరుత్పాదక శక్తి సామర్థ్యం 125 గిగావాట్లు అదనంగా ఉంటుందని, 2030 నాటికి లక్ష్యాలు రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు, 6 లక్షల ఉద్యోగాల సృష్టి. దాదాపు 50 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను నివారించవచ్చని భావిస్తున్నారు. అలాగే, హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రభుత్వ యాజమాన్యంలోని ఎస్‌జేవీఎన్ లిమిటెడ్ ద్వారా 382 మెగావాట్ల సున్ని డ్యామ్ హైడ్రో విద్యుత్ ప్రాజెక్టు కోసం మౌలిక సదుపాయాల కల్పన ఖర్చు కోసం కేంద్రం నుంచి బడ్జెట్ మద్దతుగా రూ.13.80 కోట్లతో సహా రూ.2,614.51 కోట్ల పెట్టుబడికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీని ద్వారా దాదాపు 4 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అంచనా. కాగా రూ.2,614 కోట్ల ప్రాజెక్టు వ్యయంలో కఠిన ఖర్చుల మొత్తం రూ.2,246.40 కోట్లు, నిర్మాణ సమయంలో వడ్డీ (ఐడీసీ), ఫైనాన్సింగ్ చార్జీలు (ఎఫ్‌సీ) వరుసగా రూ.358.96 కోట్లు, రూ.9.15 కోట్లు.

రూ.2,539.61 కోట్లతో ప్రసారభారతి బలోపేతం

దూరదర్శన్, ఆకాశవాణి (ప్రసార భారతి) మౌలిక సదుపాయాలు, సేవలను అభివృద్ధి చేయడానికి, ఆధునీకరించడానికి ప్రభుత్వం తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. మారుమూల ప్రాంతాలు, వ్యూహాత్మక, సరిహద్దు ప్రాంతాలలో ప్రసార భారతి పరిధిని విస్తృతం చేయాలనే లక్ష్యంతో బ్రాడ్‌కాస్టింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ నెట్‌వర్క్ డెవలప్‌మెంట్ (బైండ్) కింద ఆకాశవాణి, దూరదర్శన్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం 2025-26 వరకు రూ.2,539.61 కోట్లతో పథకానికి ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. మరిన్ని ఛానెల్‌లకు అనుగుణంగా డీటీహెచ్ వేదిక సామర్థ్యాన్ని నవీకరించడం ద్వారా వీక్షకులకు మరింత వైవిధ్యమైన ప్రసారాలను అందిస్తుంది.

వారసుడు ప్రమోషన్స్‌కు విజయ్ అనుమానమే!

హైదరాబాద్: నిర్మాత దిల్ రాజు తమిళ సూపర్ స్టార్ విజయ్‌తో 'వారిసు' అనే సినిమాని తీశాడు. ఇది తెలుగులో 'వారసుడు'గా సంక్రాంతి పండగ సందర్భంగా 12న విడుదల అవుతోంది. దీనికి తెలుగు దర్శకుడు వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించారు. ఈమధ్య చెన్నైలో ఈ సినిమా తమిళ ప్రమోషన్స్‌కు విజయ్ హాజరయ్యాడు. అయితే దిల్ రాజు తెలుగులో కూడా ఈ సినిమా ప్రమోషన్స్ భారీగా చేయాలని చూస్తున్నాడు. కానీ విజయ్ మాత్రం తెలుగు ప్రమోషన్స్ కి దూరంగా ఉంటాను అని దిల్ రాజుకు చెప్పాడని సమాచారం. అదీ కాకుండా ఇది డబ్బింగ్ సినిమా. ఇంత పెద్ద పండగ రోజు తెలుగు సినిమాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా డబ్బింగ్ సినిమా ఎలా విడుదల చేస్తారని, కొంత కాలంగా తెలుగు పరిశ్రమలో రచ్చ జరుగుతోంది. చిరంజీవి నటించిన 'వాల్తేరు వీరయ్య', అలాగే బాలకృష్ణ నటించిన 'వీరసింహా రెడ్డి' రెండు సినిమాలు పండగకు వస్తున్నాయి. కానీ దిల్ రాజు తన థియేటర్స్‌లో మాత్రం తన డబ్బింగ్ సినిమా వారసుడు వేసుకుంటాను అని చెప్పినట్టు తెలుస్తోంది. ఈ విషయం ఇలా నడుస్తుంటే, విజయ్ తెలుగు సినిమా ప్రమోషన్స్‌కు రాను అనడం వాళ్ల దిల్ రాజు కొంచెం డీలా పడ్డ మాట వాస్తవం అని అంటున్నారు.

అఖిల్ ఏజెంట్ పూర్తి

హైదరాబాద్: అఖిల్ అక్కినేని, దర్శకుడు సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో వస్తున్న 'ఏజెంట్' సినిమా మొత్తానికి పూర్తి అయింది అని అంటున్నారు. ఈ సినిమా మొదలు పెట్టి చాలా కాలం అవుతున్నా ఇంతవరకు పూర్తి కాలేదు అని, దర్శకుడి మీద నిర్మాతల మీద చాలా విమర్శలు వచ్చాయి. ఇందులో మలయాళం సూపర్ స్టార్ మమ్మూట్టి ఒక ప్రధాన పాత్ర పోషిస్తూ ఉండటం ఒక విశేషం. ఈ సినిమా ముందుగా సంక్రాంతికి విడుదల అని వేసుకున్నారు కానీ, సినిమా షూటింగ్ అవకుండానే ఆలా వేసుకున్నారు అని తెలిసింది, మళ్లీ విడుదల తేదీ వాయిదా వేసుకు న్నారు. సినిమాలో ఇంకా క్లైమాక్స్, ఒక సాంగ్ మాత్రమే మిగిలి ఉన్నాయని, అవి ఎప్పుడైనా చిత్రీకరించవచ్చునని తెలిసింది. క్లైమాక్ పార్టు ఒక విదేశంలో చిత్రీకరిస్తారని, అప్పుడే ఆ సాంగ్ కూడా అక్కడే చేసేస్తారని తెలిసింది. టీం ఇప్పుడు ఆ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ మీద ఫోకస్ పెట్టిందని కూడా తెలిసింది. అఖిల్ అక్కినేని ఈ సినిమా కోసం చాలా కష్ట పడ్డాడు. దీనికోసం ఒక ప్రత్యేకమయిన ఫిజిక్‌ని పెంచుకొని లుక్ కూడా మార్చాడు.

టీమిండియానా? గుజరాత్ జట్టా?

మండిపడుతున్న ఫ్యాన్స్!

ముంబై: టీమిండియా యువ బ్యాటర్ రాహుల్ త్రిపాఠికి మరోసారి నిరాశే ఎదురైంది. గతేడాది టీమిండియా ద్వితీయ శ్రేణి జట్టు ఆడిన ప్రతీ సిరీస్‌కు ఎంపికైన రాహుల్ త్రిపాఠి... తుది జట్టులో మాత్రం చోటు దక్కించుకోలేకపోయాడు. పూర్తిగా బెంచ్‌కే పరిమితమైన రాహుల్ త్రిపాఠి వాటర్ బాయ్‌గానే జట్టుకు సేవలందించాడు. ఇక కొత్త ఏడాది శ్రీలంకతో జరిగే టీ20 సిరీస్‌కు ఎంపికైన రాహుల్ త్రిపాఠి.. అరంగేట్రం చేయడం ఖాయమని భావించిన అభిమానులకు నిరాశే ఎదురైంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్ గైర్హాజరీలో హార్దిక్ పాండ్యా సారథ్యంలో బరిలోకి దిగిన టీమిండియా.. మరోసారి రాహుల్ త్రిపాఠికి మొండిచెయ్యే చూపించింది.

శుభ్‌మన్, శివమ్ అరంగేట్రం..

వాంఖడే వేదికగా జరుగుతున్న తొలి టీ20లో రాహుల్ త్రిపాఠి లేకుండానే బరిలోకి దిగింది. ఈ మ్యాచ్ ద్వారా శుభ్‌మన్ గిల్, శివమ్ మావి అరంగేట్రం చేయగా.. రుతురాజ్ గైక్వాడ్, రాహుల్ త్రిపాఠిలు బెంచ్‌కే పరిమితమయ్యారు. ఇషాన్ కిషన్‌తో కలిసి గైక్వాడ్ ఆడుతాడని అంతా భావించగా.. టీమ్‌మేనేజ్‌మెంట్ మాత్రం శుభ్‌మన్ గిల్‌కు అవకాశం ఇచ్చింది. అర్ష్‌దీప్ సింగ్ ఫిట్‌గా లేకపోవడంతో శివమ్ మావి అవకాశం అందుకున్నాడు. అయితే రాహుల్ త్రిపాఠికి అవకాశం ఇవ్వకపోవడంపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సిరీస్‌కు ఎంపిక చేసి బెంచ్‌కు పరిమితం చేయడం సరికాదని మండిపడుతున్నారు.

వాటర్ బాటిల్స్ అందించేందుకే..

రాహుల్ త్రిపాఠికి వచ్చిన కష్టం పగోడికి కూడా రావద్దంటున్నారు. వాటర్ బాటిల్స్ అందించేందుకే రాహుల్ త్రిపాఠిని జట్టులోకి తీసుకుంటున్నారా? అని నిలదీస్తున్నారు. దేశవాళీ క్రికెట్‌లో సెంచరీల మోత మోగించిన రుతురాజ్ గైక్వాడ్‌ను పక్కనపెట్టడం కూడా సరికాదంటున్నారు. గతేడాదే జిడ్డు బ్యాటింగ్‌తో కేఎల్ రాహుల్ జట్టు కొంపముంచాడని, మళ్లీ అతనిలా ఆడే శుభ్‌మన్ గిల్‌కు అవకాశం ఇవ్వడం ఏంటని మండిపడుతున్నారు. శుభ్‌మన్ గిల్ బదులు ధాటిగా ఆడే రుతురాజ్ గైక్వాడ్‌ను ఓపెనర్‌గా ఎంపిక చేయాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం రాహుల్ త్రిపాఠి, రుతురాజ్ గైక్వాడ్‌పై సోషల్ మీడియా వేదికగా సానుభూతి వ్యక్తమవుతోంది.

టీమిండియానా? గుజరాత్ జట్టా?

ఇక ఈ మ్యాచ్‌లో పూర్తిగా గుజరాత్ ఆటగాళ్లకే ప్రాధాన్యత ఇవ్వడం చర్చనీయాంశమైంది. గుజరాత్ టైటాన్స్‌కు చెందిన శుభ్‌మన్ గిల్, శివమ్ మావి అరంగేట్రం చేయడం.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన దీపక్ హుడాలకు జట్టులో అవకాశం ఇవ్వడంపై ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుతురాజ్ గైక్వాడ్, అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్‌లను పక్కనపెట్టి మరీ గుజరాత్ ఆటగాళ్లకు అవకాశాలిచ్చారని ఆరోపిస్తున్నారు. కొంతకాలంగా గుజరాత్ ఆటగాళ్లకు భారత జట్టులో అనవసర ప్రాధాన్యత లభిస్తుందనే వాదన గట్టిగా వినిపిస్తోంది.

యూకేకు పంత్?

అవసరమైతే పంపేందుకు బీసీసీఐ సన్నాహాలు

ముంబై: గతవారంలో రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న టీమిండియా యువ బ్యాటర్ రిషభ్ పంత్ డెహ్రాడూన్ ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. నుదుటికి సంబంధించి స్వల్ప ప్లాస్టిక్ సర్జరీ జరిగిన విషయం తెలిసిందే. అయితే ఇంకా మెరుగైన వైద్యం కోసం అతడిని ముంబైకి తరలించారు. రిషభ్ పంత్ ఆరోగ్య పరిస్థితిపై ఢిల్లీ క్రికెట్ బోర్డు డైరెక్టర్ శ్యామ్ శర్మ తాజాగా వివరాలను వెల్లడించారు. 'మెరుగైన వైద్యం కోసం క్రికెటర్ పంత్‌ను ముంబైకి తరలించారు" అని శర్మ తెలిపారు. బీసీసీఐ వైద్య బృందం సమక్షంలో కుడికాలు లిగ్మెంట్‌కు శస్త్రచికిత్స నిర్వహిస్తారు. మరోవైపు బీసీసీఐ కార్యదర్శి జైషా కూడా పంత్ ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అవసరమైతే విదేశాలకు (యూకే) తరలించే అంశంపైనా బీసీసీఐ సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం.

గంగూలీ ప్రత్యేక సందేశం: రిషభ్ పంత్ త్వరగా కోలుకొని తిరిగి తన ఆట కొనసాగించాలని భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ ఆకాంక్షించాడు. 'పంత్ త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. జీవితంలో కొన్ని సంఘటనలు జరుగుతాయి. వాటిని ఎదుర్కొని నువ్వు ముందుకు సాగాలి. త్వరగా కోలుకొని తిరిగి నీమార్గంలోకి రావాలని ప్రార్థిస్తున్నాను"అని గంగూలీ పేర్కొన్నాడు.

ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులు ప్రకటన:14:13
జ్ఞాపకార్థకూడిక

కీ.శే. బురదగుంట ఇజ్రాయేలమ్మ గారు
మరణం: 28-12-2022

మంచికి మారుపేరుగా నిలిచి,
మా ఉన్నతికి తోడ్పాటునందించి
మానుంచి దూరమైన
మీ ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ....

కుమారులు - కోడళ్ళు		కుమార్తెలు - అల్లుళ్ళు	
బురదగుంట అర్జునరావు	- గ్లోరీ	బురదగుంట వేణుకుమారి	- జె.ఆంటోని
బురదగుంట సుధాకర్	- సుమతీ	బురదగుంట మేరీ వనజాక్షి	- కె.ఆంధ్రియ
బురదగుంట పురుషోత్తంబాబు	- సువర్ణ	బురదగుంట సుమత	- ఎస్. అక్కయ్య
బురదగుంట జగన్నాథరావు (లేటు)	- గ్లోరీ	బురదగుంట ఇందిర	- జె. ప్రసాద్
బురదగుంట వీర్రాజు	- ఎస్తేరులత	బురదగుంట ఝాన్సీరాణి	- కె. జాన్‌బాబు

మనువళ్ళు, మనువరాళ్ళు, బంధుమిత్రులు, రక్త సంబంధికులు

గుంటూరుజిల్లా తాడికొండ శివారు బడేపురం గ్రామంలో
ది : 5-1-2023న గురువారం మా స్వగృహంనందు జ్ఞాపకార్థకూడిక జరుగును.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.